జాతీయ తెలుగు దినపత్రిక
NIZAMABAD EDITION

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జులు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

నిజామాబాద్ | బుధవారం 24 జూన్ 2026 | సంపుటి : 16 | సంచిక : 141 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం అధిక జ్యేష్ఠ మాసం గ్రీష్మ ఋతువు ఉత్తరాయణం ప్రదోష వ్రతం సూర్యోదయం : 5.25, సూర్యాస్తమయం 6.28, చంద్రోదయం చంద్రాస్తమయం 3.20-3.38 బహుళ ద్వాదశి సా. 4.11 వరకు తదుపరి త్రయోదశి నక్షత్రం యోగం అతిగండ రా. 7.25 వరకు తదుపరి సుకర్మ భరణి రా. 1.51 వరకు తదుపరి కృత్తిక కరణం తైతుల సా.4.11 వరకు తదుపరి గరజి రా.3.06 వరకు తదుపరి వణజి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# కోట్లల్లో అక్రమార్జన!

## 'ఈఎస్' ఇంటిపై ఏసీబీ దాడులు.. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు ఫిర్యాదులు

## మొత్తం 11 చోట్ల విస్తృత తనిఖీలు.. బయటపడిన పడిన అక్రమ ఆస్తులు

## సూపరింటెండెంట్ మల్లారెడ్డిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు



వినాయక్‌నగర్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి ఇంటిపై ఏసీబీ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక బృందాలు విస్తృత సోదాలు చేయడం, ఎక్సైజ్ శాఖలో కలకలం సృష్టించింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంతో పాటు శ్రీనగర్ కాలనీలో ఈఎస్ నివాసంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాయి. అనంతరం ఈఎస్ మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి తమ వెంట తీసుకెళ్లారు. కోట్ల రూపాయల అక్రమాస్తులు బయట పడ్డాయి. జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లోని ఈఎస్ మల్లారెడ్డి నివాసం, సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతంలోని మద్దూర్ వద్ద గల నర్సయ్యపల్లె ఆయన స్వగ్రామంతో పాటు మిగతా వారి బంధువుల ఇండ్లలో మొత్తం 11 చోట్ల దాడులు నిర్వహించారు. దాడుల్లో ఈఎస్ మల్లారెడ్డికి సంబంధించి కోట్ల రూపాయల్లో అక్రమ ఆస్తులు బయటపడ్డట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈఎస్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేర్ల మీద మూడు బ్యాంకు లాకర్లను గుర్తించారు. బ్యాంకు బ్యాలెన్స్ రూ. 50 లక్షలు, ఆయన ఇంట్లో రూ.3.31 లక్షల నగదు తో పాటు 10.23 ఎకరాల అగ్రికల్చర్ ల్యాండ్, 8 ఓపెన్ ప్లాట్లు, 4 ఇండ్లు, ఒక కమర్షియల్ కాంప్లెక్స్, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం గుర్తించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.3 కోట్లు ఉంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎస్ మల్లారెడ్డి వద్ద లభించిన అక్రమాస్తుల విలువ మార్కెట్ రేటు ప్రకారం ఏసీబీ అధికారులు వెల్లడించిన విలువలతో పోలిస్తే మరో మూడు నుంచి నాలుగు రేట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అధికారుల ద్వారా తెలిసింది. ఈఎస్ మల్లారెడ్డిపై కేసు నమోదు చేసి ఆయనను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని నాంపల్లిలోని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక కోర్టులో మంగళవారం సాయంత్రం హాజరుపర్చగా ఆయనకు రిమాండ్ విధించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.



# రేవంత్‌రెడ్డిది నిరంకుశ పాలన

## రైతుల గొంతు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు వెళ్తే బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టు దుర్మార్గం

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల



# తాడ్వాయిలో తీవ్ర ఉద్రిక్తత

## యాప్‌నకు వ్యతిరేకంగా రైతుల పోరుబాట

## మద్దతుగా తాడ్వాయిలో నిరసనకు బీఆర్ఎస్ పిలుపు

## పోలీసు జులంతో అడ్డుకున్న రేవంత్ సర్కారు

## తెల్లవారకముందే ఇండ్లపై పడ్డ పోలీసులు

## కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అక్రమ అరెస్టులు

## మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేల నిర్బంధం

# యాప్ రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం!

## పాలన చేతకాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి

## ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

బాన్సువాడ/ఎల్లారెడ్డి




యూరియా యాప్ రద్దు చేసే వరకు రైతుల పక్షాన ఉద్యమిస్తామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్పష్టం చేశారు. తాడ్వాయి లో చేపట్టనున్న 'నిరసన'లో పాల్గొన కుండా అరెస్టు చేసి ఆయనను అక్కడి నుంచి బీర్కూర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన బీర్కూర్, తాడ్వాయిలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలు, రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి ఒక జోకర్ ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. పాలన చేతకాని దద్దమ్మ అని విమర్శించారు. యూరియా యప్ తెచ్చి రైతులను ఆగం చేస్తున్నదని మండిపడ్డారు. యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు అల్లాడుతుంటే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు తెలియడం లేదని, ఆయన గూండాలు, పోలీసులను పక్కనబెట్టి గ్రామాల్లో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయని జాజాల సురేందర్ సూచించారు. ఆయనకు రైతుల కష్టాలు తెలియదని, నియోజక వర్గం లో సాగు భూమి ఎంత ఉందో కూడా అయనకు తెలియదన్నారు. కాంగ్రెస్ నాయకులు సైతం తనకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని జాజాల తెలిపారు.

**ఠాణా వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా**

జాజాల సురేందర్‌ను అరెస్టు చేసి బీర్కూర్ పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఠాణాకు చేరుకున్నాయి. జాజాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీర్కూర్- బిచ్కుంద రోడ్డుపై ధర్నా చేపట్టారు. జాజాలను విడుదల చేయడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన విరమించారు.

# గంగారం తండాలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్. 23** ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల ద్వారా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ ప్రారంభించారు ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత దిలీప్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో ఏ గల్లీ కూడా సీసీ రోడ్డు లేకుండా ఉండదని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హులైన వృద్ధులు, మహిళలు తదితరులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహం లేని నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ సదుపాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు సంతోషిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పనులను చూసి ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సంక్షేమానికి దూరంగా ఉన్నాయని విమర్శించారు. పేద ప్రజల ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధూమ వాడు మిమ్మల్ని బుజ్జి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించిన ఆర్డీఓ విజయకుమారి...



**ప్రజా జ్యోతి.బోధన్ జూన్ 23.**. సర్-2026 లో భాగంగా బోధన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆర్డీఓ కార్యాలయం ఎలక్షన్ సెల్ వద్ద, ఎన్నికల సంఘం అదేశానుసారం హెల్ప్ డెస్క్ ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ హెల్ప్ డెస్క్ సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. సర్-2026 ప్రక్రియలో ప్రజలకు తలెత్తుతున్న సందేహాలు, సమస్యలను పరిష్కరించటంలో హెల్ప్ డెస్క్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, సీనియర్ అసిస్టెంట్ సుశీల, ఆపరేటర్ ముస్తఫా తదితరులు ఉన్నారు.

## తాడ్వాయిలో తీవ్ర ఉద్రిక్తత

ఎల్లారెడ్డి/తాడ్వాయి, జూన్ 23:యూరియా కోసం రైతులు చేపడుతున్న నిరసనలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. యాప్ రద్దు కోసం పోరుబాట పట్టిన రైతులను, వారికి మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసుల సాయంతో అణగదొక్కుతున్నది. యూరియా యాప్ వద్దంటూ రోడ్డెక్కుతున్న రైతులకు బాసటగా తాడ్వాయిలో బీఆర్ఎస్ మంగళవారం తలపెట్టిన వంటావార్పు కార్యక్రమాన్ని రేవంత్ సర్కారు పోలీసు బలగాలతో అడ్డుకున్నది. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. తాడ్వాయిని దిగ్బంధించిన వందలాది మంది పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. తనిఖీల పేరిట సామాన్యులను సైతం ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా రైతులతో సహా చాలా మందిని అదుపులోకి తీసుకన్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అరెస్టు చేసి, ఠాణాల్లో నిర్బంధించారు. ఈ క్రమంలో పోలీసు జులుం ప్రదర్శించి నేతల పట్ల విచక్షణంగా ప్రవర్తించారు. శాంతియుత నిరసన కార్యక్రమంపై ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరును రైతులు, ప్రజలు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నిరసనను అడ్డుకునే క్రమంలో పోలీసులు అతిగా ప్రవర్తించారు. ప్రజాప్రతినిధులతో పాటు రైతులను ఎత్తి వ్యాన్ల లో పడేశారు. ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. కాళు చేతులు పట్టుకుని లాక్కెళ్లి వాహనాల్లో ఎక్కించారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తోనూ అమానవీయంగా వ్యవహరించారు. సామాన్య రైతులా బైక్‌పై తాడ్వాయికి వచ్చిన ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన కాళ్లు, చేతులు పట్టుకుని పోలీసు వాహనంలోకి నెట్టేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ పెట్రోల్ బాటిళ్లతో వచ్చిన సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి, ఇతరుల పట్ల దారుణంగా ప్రవర్తించారు. అమాంతం ఎత్తి కిందపడేసి లాక్కెళ్లారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది.

**వేముల, షిండే హౌస్ అరెస్టు..**

తాడ్వాయిలో చేపట్టిన వంటావార్పు కార్యక్రమానికి రాకుండా మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో అడ్డుకున్నారు. బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలోనే హౌస్ అరెస్టు చేశారు. తాడ్వాయికి రాకుండా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేను గృహ నిర్బంధం చేశారు. ఇక ఎల్లారెడ్డితో పాటు కామారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని గులాబీ నేతలను తెల్లవారుజాము నుంచే అదుపులోకి తీసుకుని ఠాణాలకు తరలించారు. పోలీసుల వైఖరిపై రైతులతో పాటు సామాన్యులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**వేషం మార్చి.. పోలీసులను ఏమార్చి..**

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పోలీసుల కండ్లుగప్పి, చాకచక్యంగా తాడ్వాయికి చేరుకున్నారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలోని నివాసంలో ఆయనను హౌస్ అరెస్టు చేసేందుకు తెల్లవారుజామునే పోలీసులు చేరుకున్నారు. కానీ, ఆయన వారికి చిక్కకుండా జాగ్రత్త పడ్డారు. తన ఫోన్ స్విచాఫ్ చేసి, డ్రైవర్‌ను, పీఏ వెంటబెట్టుకోకుండా వేరే వాహనంలో బయల్దేరారు. భిక్కనూరులో పోలీసులు అనుమానించగా, రూట్ మార్చి దోమకొండ మీదుగా పాల్వంచ నుంచి కామారెడ్డికి చేరుకున్నారు. వేషం మార్చి, పోలీసులను ఏమార్చి, ఓ కార్యకర్త బైక్‌పై సామాన్య రైతులా బయల్దేరారు. టేక్రియాల్, బ్రాహ్మణపల్లి, చందాపూర్ మీదుగా ఆయన తాడ్వాయికి చేరుకున్నారు. రైతు వేషంలో తలపాగా చుట్టుకుని సామాన్యుడిలా వందలాది మంది బలగాలను దాటుకుని వచ్చిన ఆయనను చూసి పోలీసులు బిక్కముఖం వేశారు. జై తెలంగాణ, జై బీఆర్ఎస్ అంటూ జాజాల ఆందోళనకు దిగడంతో తేరుకున్న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూరియా యాప్‌నకు వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ తాడ్వాయిలో మంగళవారం వంటా వార్పునకు పిలుపునిచ్చింది. దీన్ని ఎలాగైనా అడ్డుకోవాలని ప్రభుత్వం పోలీసులను పురమాయించింది.

## ఆటో నగర్ లో ఆటో కార్మికులకు ఇళ్ల పట్టాల పంపిణీ. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజా జ్యోతి.బోధన్ జూన్23** : బోధన్ పట్టణంలోని ఆటోనగర్‌లో ఆటో యూనియన్ కార్మికులకు మంగళవారం బోధన్ ఆర్డిఓ కార్యాలయంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా అర్హులైన ఆటో కార్మికులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆటో కార్మికులు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, సొంత ఇంటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించేలా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం అమలు చేస్తోందని తెలిపారు. ఇళ్ల పట్టాలు అందుకున్న ఆటో కార్మికులు తమకు ఎంతోకాలంగా ఉన్న సొంత ఇంటి ఆశ నెరవేరినందుకు ఎమ్మెల్యే సుధర్శన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డిఓ విజయకుమారి, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశారత్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం...




**ప్రజా జ్యోతి ,బోధన్ జూన్ 23** : బోధన్ పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ బోధన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం లయన్స్ కంటి ఆసుపత్రి, జనరల్ ఆసుపత్రి, మనోరమ ఆసుపత్రి నిజామాబాద్ సహకారంతో కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది మొత్తం 250మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. ముందుగా న్యాయమూర్తి వరూధిని, కాంచనా రెడ్డి, పూజిత, సాయి శివ, ఏసీపీ శ్రీనివాస్ ల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. బార్ అధ్యక్షులు. వి ఆర్ దేశాయ్, ఉపాధ్యక్షులు విద్యా సాగర్,సమ్మయ్య, వాజీద్ నర్సింహా రెడ్డి, గౌసుద్దీన్, ఈశ్వర్, మోహన్, శ్రీనివాస్, గంగాధర్ గౌడ్, సుబ్బారావు, దత్తాత్రి రావు, శ్యామ్ రావు, అజయ్, కోటేశ్వరరావు, శ్రీనురాజ్,మాధవి లత, ధర్మయ్య, రఘు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయిలో ప్రత్యేక విత్తనమేల ప్రారంభం సన్న రకాల వరి విత్తనాలపై ప్రభుత్వ బోనస్



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి) జూన్. 23** ఇందల్వాయి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం సన్నారకాల వరి సాగును ప్రోత్సహించడం లక్ష్యంగా ఇందల్వాయి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విత్తన మేల మంగళవారం ప్రారంభమైంది ఈ విత్తనమేల జూన్ 23 నుంచి 30 వరకు నిర్వహించబడుతుంది. మండలంలోని ఇందల్వాయి లోలా నల్లవెల్లి రైతు వేదికలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి రైతులకు విత్తనాల విక్రయ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు ఈ నెలలో ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్న సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న వరి విత్తన రకాల్లో కేఎన్ఎం. 1638. కే ఎన్ ఎం.7715. ఆర్ ఎన్ ఆర్ -15048. హెచ్ఎంటి సోనా. జైశ్రీరామ్. డబ్ల్యూ జి ఎల్ -44 బిపిటి.5204 తదితర రకాలు ఉన్నాయి. ఈ సన్న రకాల వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖ సిఫార్చేసిన ఈ వరి రకాలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలను కూడా పొందవచ్చునని తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో విత్తనమేలను సందర్శించి ప్రయోజనం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఏ ఈ ఓ లు అపూర్వ మనోజ్ రమాకాంత్ రైతులు పాల్గొన్నారు.



## మీసేవ ఆపరేటర్లకు ఎమ్మార్వో బాలయ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు

**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) జూన్. 23** ఇందల్వాయి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో మీసేవ ఆపరేటర్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తాసిల్దార్ బాలయ్య అధ్యక్షత వహించి జూన్ 25 6 2026 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఇంటిన్సెవె డివిజన్ (స్పెషల్ ఇంటిన్సివే రెవిషన్ ) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మీసేవ ఆపరేటర్లు పూర్తి అ సహకారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటర్ని నమోదు చేయడం. వివరాలు సవరణలు మార్పులు చేర్పులు వంటి కార్యక్రమాలను వేగవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం మీసేవ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవులు నిర్వహించి ప్రజలకు అవసరమైన సేవలు త్వరగా అందించాలని సూచించారు. అలాగే బూత్ లెవెల్ అధికారులు ( బి ఎల్ ఓ లు) క్షేత్రస్థాయిలో చేపట్టి కార్యక్రమాలకు మీసేవ ఆపరేటర్లు సూపర్వైజర్లు సామాన్యాయంతో సహకరించాలని కోరారు ఓటర్ జాబితా కార్యక్రమం సజీవుగా జరిగేలా ప్రతి మీ సేవ కేంద్రం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన తెలిపారు. మీసేవ యజమానియానికి కూడా ప్రత్యేక సూచనలు జారీ చేసిన తహసిల్దార్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని అవసరమైన దరఖాస్తులను వెంటనే ప్రాసెస్ చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఐ ప్రవీణ్ జిపిఓ ప్రభాకర్ జిపిఓ రాజేష్ డిప్యూటీ మేడం బాలకృష్ణ వనిత చరణ్ అధికారులు పాల్గొన్నారు

## ట్రిపుల్ ఐటికి ఎంపికైన సత్యశోధక్ విద్యార్థిని డి. శ్రీజ

– సత్కరించిన ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య




**సిరికొండ ( ప్రజా జ్యోతి ), జూన్,** 23 రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ , ట్రిపుల్ ఐటీ మహబూబ్‌నగర్‌కు సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని డి. శ్రీజ ఎంపికైనందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నాము. పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 572 మార్కులు సాధించిన డి.శ్రీజ ప్రస్తుతం ట్రిపుల్ ఐటీ మహబూబ్‌నగర్‌లో ప్రవేశం పొందడం పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని శ్రీజను ప్రిన్సిపాల్ నర్సయ్య ప్రత్యేక జ్ఞాపికను అందించి ఘనంగా అభినందించారు. తదనంతరం ఆర్.నర్సయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదల ముందుకు సాగాలని సూచించారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశం శ్రీజ జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు లలిత మోహన్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో నాలుగో రోజు నిరసన




**ప్రజాజ్యోతి,బాల్కొండ జూన్23** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్ మరియు యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో ఉద్యోగుల ఆందోళన నాలుగో రోజుకు చేరుకుంది. టీజీపీఈజేఏసీ నాయకులు కె. సతీష్, ఎం.డి. రఫీక్, దేవరాజ్, ఎం. ప్రవీణ్, చంద్రశేఖర్, నరేష్, శృతిమ, రాంబాబు, స్వాతి, ఏ.వి. శ్రీనివాస్ తదితరుల నాయకత్వంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌కో ఉద్యోగులకు మద్దతుగా ట్రాన్స్‌కో, డిస్కం ఉద్యోగులు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. యాజమాన్యం టెండర్ ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకోకపోతే మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జల విద్యుత్ కేంద్ర ఉద్యోగులు, టీజీపీఈజేఏసీ నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**జోరుగా పరిసరాలు పరిశుభ్రత**

బాల్కొండ అసెంబ్లీనియోజిక వర్గ కేంద్రమైన బాల్కొండ మేజర్ గ్రామ పంచాతి పాలక వర్గం నిర్ణయశీ మేరకు "పరిసరాల – పరిశుభ్రత " లో బాగంగా (16) వార్డుల్లో పెరుక పోయిన చెత్త తొలగింపులో భాగంగా సమీప గ్రామమైన పడిగల్ గ్రామంనుండి (15) మందిని రోజు కూలి కింద డబ్బులు చెల్లిశీపులు చేసి గ్రామంలోని అన్ని విధుల్లో మురికి చెత్తను తొల గింపు చేయించడం జరుగు తుందని

ఈ పక్రియ ఈనెల వరకు ఉంటుందని సర్పంచ్ గాండ్ల రాజేష్, గాండ్ల రాజేందర్, కార్యదర్శి కేతవత్ మోహన్ నాయక్ తెలిపారు.(16) మంది వార్డ్ సభ్యులు దెగ్గరఉండి మురికి చెత్తతో పాటు గుంతలు లేకుండా మోరాన్ని పోయించడం తో పాటు పుర వీధుల్లో దోమల నీవారణ నిమిత్తశీ దోమ మందుల్ని పిచికారి కూడా చేయించడం " మా ఊరు మా చరిత్ర " లో భాగంగా స్థానిక ఖిల్లా లో కూడా ముల్ల పొదలను తొలగింపు చేయడం పట్ల ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇది ఇలా ఉండగా మొదటి వార్డ్ మెంబర్ నవీన్ విజ్ఞప్తి మేరకు సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్, ఆదేశాలతో నకాష్ గల్లీ లోని శ్రీ నిమిషంబ ఆలయం వెనుక గుట్టల నుండి వచ్చే నీరు లోతట్టు ప్రాంతాల ఇళ్లల్లోకి నీరు రాకుండా గుట్ట వెంబడి జె. సి.బి తో కాలువ నిర్మాణం పూర్తి చేసామని కార్యదర్శి కేతవత్ మోహన్ నాయక్ తెలిపారు.

# పన్నులు చెల్లించరు? పనులు కావాలి - సర్పంచ్ ఆవేదన





**బాల్కొండ మేజర్ గ్రామ పంచాయతి (16)** వార్డులు ఉన్నాయి, కానీ కొందరు ఇంటి యజమానులు ఎల్లా తరబడి ఇంటి పన్నులు చెల్లించడం లేదన సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్ కార్యదర్శి కేతవత్ మోహన్ నాయక్ ఆవేదన వ్యక్తం చేసారు. ఊర్లోని అభివృద్ధి పనులకు నిధులు కావలసి ఉందని సకాలంలో పన్నులు చెల్లించాలని వారు స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి

కలెక్టర్ తో కలిసి నవీపేటలో స్థల పరిశీలన



**నవీపేట్: (ప్రజా జ్యోతి) జూన్ 23 :** విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. నవీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన పరిస్థితులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పబ్లిక్ స్కూల్ కోసం అందుబాటులో ఉన్న స్థలం, ఇతర వసతులను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు, అధునాతన సౌకర్యాలతో 4 ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట ఒకటవ తరగతి నుండి 12 తరగతి వరకు నాణ్యమైన విద్యా బోధన జరిగేలా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే బోధన్ నియోజకవర్గంలో రూ. 200 కోట్ల నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.

కాగా, అధునాతన వసతులతో ప్రభుత్వం నిర్మించదల్చిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు తరగతి గదులతో పాటు, ల్యాబ్ రూమ్ లు, లైబ్రరీ, కంప్యూటర్ గదులు, ఆర్.ఓ ప్లాంట్, బోర్ వెల్ తదితర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకం అయ్యారు. పలు ప్రశ్నలు వేస్తూ, విద్యార్థులు సామర్థ్యాన్ని పరీక్షించారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు, బహుమతులు అందించి ప్రోత్సహించారు. వీరి వెంట జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# రావుట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం నిర్వహణ




**సిరికొండ ( ప్రజా జ్యోతి), జూన్ 23** సిరికొండ మండల కేంద్రంలోని రావట్ల గ్రామంలో యువత మరియు విద్యార్థులను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఈ రోజు రావుట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల (డ్రగ్స్) నివారణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులకు గంజాయి, హెరాయిన్, కొకైన్, సింథటిక్ డ్రగ్స్, మత్తు మాత్రలు, మద్యం, పొగాకు ఉత్పత్తులు వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి సవివరంగా వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు విద్యాభ్యాసం, కుటుంబ జీవితం మరియు భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలియజేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగానికి సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, వాటికి విధించే శిక్షల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొందరు వ్యక్తులు స్నేహితుల రూపంలో లేదా ఇతర మార్గాల ద్వారా యువతను డ్రగ్స్ వైపు ఆకర్షించే ప్రయత్నాలు చేస్తారని, అలాంటి ప్రలోభాలకు లొంగకూడదని సూచించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకోవడం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు విద్యపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అవును చెప్పండి."

# ప్రభుత్వ పాఠశాలలో గ్రామ విద్యార్థులు చదవాలని తీర్మానం




**ప్రజాజ్యోతి,బాల్కొండ జూన్23** ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం వారు గ్రామంలో గల నర్సరీ నుండి 3వ తరగతి వరకు విద్యార్థులు అందరినీ యుపిఎస్ పాఠశాల లోనే చదివించాలని, గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయడం జరిగింది, ప్రైవేట్ పాఠశాలల్లో ఎవ్వరూ కూడా పంపా వద్దు అని తెలిపారు, ఇట్టి తీర్మాన కాపీను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడుకి మరియు గ్రామ సహకార సంఘం అధ్యక్షులకు కలిసి ఇవ్వడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి గంగాధర్, ఉప సర్పంచ్ పంతంగి మదన్ కుమార్, మరియు గ్రామ పంచాయతీ కార్యదర్శి మంచిర్యాల కవిత మేడం, వార్డు సభ్యులు రవి, నారాయణ, సాయిలు,సురేష్, గంగమణి, ముత్తన్న,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు లక్ష్మణ్ , సహకార సంఘం అధ్యక్షులు నల్ల వినయ్ కుమార్,పాఠశాల ఉపాధ్యాయురాళ్లు అంగన్వాడి టీచర్లు,విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రోగులకు ఉచిత మోతి బిందు కంటి చికిత్స



**ప్రజాజ్యోతి,బాల్కొండ జూన్23** బాల్కొండ మండలం జలల్ పూర్ గ్రామంలో. గ్రామ సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి.మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో. ఉచిత వైద్య కంటి పరీక్షల శిబిరంలో. ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి. ముధోల్ హాస్పిటల్ కు 13 మంది రోగులను పంపించగా. అందులో నుండి 11 మందికి మోతి బిందు ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించారు. ఆపరేషన్లు జరిగిన రోగులు స్థానిక సర్పంచ్ కు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

# రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఇందల్వాయి మండల్ నూతన కాంగ్రెస్ ప్రెసిడెంట్ చింతల కిషన్



**నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే కలిసిన చింతల కిషన్( ప్రజా జ్యోతి)** జూన్. 23 ఇందల్వాయి మండలంలోని నూతనంగా ఎన్నికైన ఇందల్వాయి కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిశారు ఎమ్మెల్యే నివాసంలో కలిశారు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు నా మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని నూతనంగా ఎన్నికైన ఇందల్వాయి కాంగ్రెస్ ప్రెసిడెంట్ అన్నారు ఎల్లవేళలా మీ తోటి పాడు ఉండాలా అని అన్నారు ఎమ్మెల్యే ఆశీర్వాదంతో కార్యకర్త నుంచి మండల ప్రెసిడెంట్ వరకు వచ్చినందుకు చాలా సంతోషపడుతున్నానని తెలియజేశారు నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రెసిడెంట్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు కార్యకర్తలే మా బలమని అన్నారు మరియు మండల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు తెలిపారు

# రైతు ప్రయోజనాలను కాపాడడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి....



**నవీపేట్:(ప్రజా జ్యోతి)జూన్ 23 :** రైతాంగ ప్రయోజనాలను కాపాడడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. నవీపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. రైతులకు అందిస్తున్న వివిధ పంటలకు సంబంధించిన వంగడాలను, ఎరువులు, క్రిమిసంహారక మందుల నాణ్యతను పరిశీలించారు. నకిలీ, నాసిరకం విత్తనాల పంపిణీ జరగకుండా, ఎక్కడ కూడా రైతులు నష్టపోకుండా చూడాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. రైతులకు సమర్థవంతంగా సేవలు అందించేందుకు వీలుగా రైతు వేదికలలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు మేళా కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ లో పంటల సాగుకు సరిపడా యూరియా, ఇతర ఎరువుల నిలువలు అందుబాటులో ఉన్నాయని రైతులకు భరోసా కల్పించారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ సజావుగా జరుగుతోందని, ఎలాంటి సాంకేతిక సమస్యలు లేవని అన్నారు. తెలంగాణాలో సమర్థవంతంగా అమలు అవుతున్న ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ పద్ధతిని దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేస్తున్నాయని సూచించారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కాకూడదని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నానో యూరియా వినియోగంపై కూడా రైతులు దృషిని కేంద్రీకరించాలని హితవు పలికారు. వీరి వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వ్యవసాయ అధికారి నవీన్ తదితరులు ఉన్నారు.

# రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్న 'యూరియా యాప్'ను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాజ్యోతి,బాల్కొండ జూన్23** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన బాల్కొండ మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు బాల్కొండ మండల కోఆప్షన్ నెంబర్ షాహిద్ మాట్లాడుతూ రైతులకు యూరియా సరఫరా చేయడంలో పూర్తిగా చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం,తన నిరంకుశ విధానాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడడం అత్యంత అవివేకం.ఇలాంటి అప్రజాస్వామిక చర్యలతో ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఎంతమాత్రం నిలువరించలేదు. రాబోయే రోజుల్లో అన్నదాతల ఆగ్రహం ఉప్పెనగా మారి ఈ నిరంకుశ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయం.ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి తక్షణమే 'యూరియా యాప్'ను రద్దు చేయాలని,పాత విధానంలోనే రైతులకు అవసరమైనంత యూరియా అందించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేసారు.

# రేవంత్‌రెడ్డిది నిరంకుశ పాలన



**మోర్తాడ్ :** రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదని, నిరంకుశ, నియంతృత్వ, నిర్బంధ పాలన అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసనలు తెలియజేయకుండా గృహ నిర్బంధం, అక్రమ అరెస్టులతో వారి గొంతు నొక్కుతున్నదని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని రైతులు యూరియా యాప్ రద్దు చేయాలని మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారని, వారి పిలుపుమేరకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి జాజాల సురేందర్ నాయకత్వంలో తాము అక్కడికి బయల్దేరేందుకు సిద్ధమవగా తనను హైదరాబాద్‌లోనే హౌస్ అరెస్ట్ చేయడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. హౌస్ అరెస్ట్ చేసిన సందర్భంగా వేముల మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నియంతృత్వ, నిరంకుశ పాలనతో సాధించేదేమీలేదని పేర్కొన్నారు. తమను అరెస్టు చేసి తమ గొంతు నొక్కే బదులు అక్కడ రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్‌సీజన్‌లోనే దేశంలో ఎక్కడ యూరియా అందుబాటులో ఉన్నా, కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచేవారని గుర్తు చేశారు. రైతులు ఆటోవాలకు డబ్బులు ఇచ్చి పంపిస్తే నేరుగా పొలాల వద్దకే యూరియా వచ్చేదని తెలిపారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియా దొరికిందని, ప్రస్తుత ముఖ్యమంత్రికి ఆ తెలివిలేదన్నారు. దీంతో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడాల్సి వస్తున్నదని తెలిపారు.

**సీఎం దృష్టి అంతా భూములపైనే..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి అంతా హైదరాబాద్‌లో భూములు ఎక్కడున్నాయి, వాటిని ఏం చేయాలనే దానిపైనే ఉంది తప్ప, రైతుల బాధలపై లేదని వేముల విమర్శించారు. మొన్నటివరకు వడ్ల కొనుగోలు కోసం రైతులను ఏడు చెరువుల నీళ్లు తాగించారని, ఇప్పుడు యూరియా కోసం ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన తెలుపుతామంటే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మంది బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను మంగళవారం వేకువజాము నుంచి అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డిది ప్రజాపాలనా లేక నియంత పాలనా అనేది తెలంగాణ సమాజం, ప్రజాసంఘాలు ఆలోచించాలని కోరారు. ఎక్కడో కామారెడ్డి జిల్లాలో నిరసన ఉంటే హైదరాబాద్‌లో తమను అరెస్ట్ చేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. తమను అరెస్ట్ చేసినా రైతుల్లో వచ్చే తిరుగుబాటును మాత్రం అపలేరని, వారు తప్పకుండా బుద్ధిచెప్తారని హెచ్చరించారు.

**రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వాలు**

ఢిల్లీకి 72 సార్లు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డికి మెట్రో రైలుపైన సమావేశాలు పెట్టడానికి సమయం ఉంటుందని, కానీ కేంద్రప్రభుత్వాన్ని యూరియా గురించి అడిగే శ్రద్ధ లేదన్నారు. రేవంత్‌రెడ్డికి రైతులంటే చాలా చులకన భావం ఉన్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం కూడా రాష్ట్రానికి రావాల్సిన యూరియాను ఒకేసారి ఇవ్వకుండా కోతలు విధిస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా, ధాన్యం కొనుగోళ్లపై తెలంగాణ రైతాంగాన్ని నట్టేట ముంచుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు

# రంగు రంగుల కాగితాలతో హైదరాబాద్‌లో జనాభా లెక్కలు

**హైదరాబాద్ :** సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలోనే హైదరాబాద్ సంస్థానం జనాభా గణనలో సరికొత్త రికార్డు సృష్టించింది. 1901 నాటి నిజాం రాజ్యంలో కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు లేకుండానే కేవలం రంగుల కాగితాలు, ప్రత్యేక చిహ్నాల సాయంతో జనాభాను అత్యంత ఖచ్చితంగా లెక్కించారు. అంతకుముందున్న సంక్లిష్ట 'టాలీ మార్కుల' పద్ధతికి స్వస్తి పలికి.. జర్మనీకి చెందిన బవేరియన్ విధానాన్ని స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి ఈ ప్రయోగం చేశారు. నాటి సెన్సస్ అధిపతి మీర్జా మెహదీ ఖాన్ నేతృత్వంలో సాగిన ఈ వినూత్న ప్రక్రియ ఇప్పటికీ దేశ చరిత్రలో ప్రత్యేకంగానే నిలిచింది.ఆధునిక సాంకేతికత, కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు అందుబాటులోకి రాకముందు.. అదీ నూట ఇరవై ఏళ్లకు పైగా సుదీర్ఘ కాలం క్రితమే హైదరాబాద్ సంస్థానంలో అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన పద్ధతిలో జనాభా గణన జరిగిందన్న విషయం మీకు తెలుసా? 1901లో నిజాం పరిపాలన సాగుతున్న కాలంలో.. అప్పటి జనాభా లెక్కల అధికారులు కేవలం రంగు రంగుల కాగితపు స్లిప్పులు, ప్రత్యేక శారీరక, సామాజిక గుర్తులను ఉపయోగించి సమగ్ర జనాభాను లెక్కించారు. నాటి హైదరాబాద్ సంస్థానంలో జరిగిన రెండో జనాభా గణనలో ప్రవేశపెట్టిన ఈ వినూత్న పద్ధతికి సంబంధించిన పలు ఆసక్తికరమైన చారిత్రాత్మక విశేషాలు ఆర్కైవ్స్ రికార్డుల ద్వారా వెలుగులోకి వచ్చాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.నిజాం రాజ్యంలో.. ముఖ్యంగా 1891 సమయంలో మొదటిసారి జనాభా గణన నిర్వహించినప్పుడు.. వ్యక్తుల వివరాలను నమోదు చేయడానికి కాగితాలను వాడేవారు. ముఖ్యంగా ఇందుకోసం ఆ కాగితాలపై గీతలు గీయడం అనే సాంప్రదాయ పద్ధతిని వాడేవారు. అయితే ఈ ప్రక్రియ చాలా సమయం తీసుకోవడమే కాకుండా, శ్రమతో కూడుకున్నదిగా, తప్పులు దొర్లడానికి ఆస్కారం ఉన్నదిగా ఉండేది. దీంతో నాటి ప్రముఖ గణాంక నిపుణులు ఈ పాత పద్ధతి పట్ల పెదవి విరిచారు. దీనిని అధిగమించడానికి హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ అధిపతిగా ఉన్న 'మీర్జా మెహదీ ఖాన్' సరికొత్త ఆలోచన చేశారు. 1871లో జర్మనీలోని 'బవేరియన్ జనాభా గణన'లో విజయవంతంగా ఉపయోగించిన కాగితపు స్లిప్పుల విధానాన్ని ఆయన అధ్యయనం చేశారు. ఆ విదేశీ పద్ధతిని భారతదేశ పరిస్థితులకు, స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చి.. మరింత సులభతరంగా మార్పులు చేసి 1901 జనాభా లెక్కింపులో ప్రవేశ పెట్టారుఈ సరికొత్త విధానంలో భాగంగా గణన అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి అక్కడి నివాసితుల మతం ఆధారంగా వేర్వేరు రంగుల కాగితపు స్లిప్పులను పంపిణీ చేసేవారు. హిందువులను లెక్కించేందుకు గోధుమ రంగు స్లిప్పులు, ముస్లింలను గుర్తించేందుకు ఆకు పచ్చ రంగు స్లిప్పులను, క్రైస్తవుల కోసం గులాబీ రంగు స్లిప్పులను, జైనుల జనాభాను లెక్కించేందుకు నీలం రంగు స్లిప్పులను ఉపయోగించారు. ఇతర మతాలు, విశ్వాసాల వారి కోసం తెలుపు రంగు స్లిప్పులను కేటాయించారు.కేవలం మతాన్నే కాకుండా సదరు వ్యక్తి లింగం, వైవాహిక స్థితిని కూడా సులభంగా తెలుసుకునేందుకు ఈ స్లిప్పులపై ప్రత్యేక రేఖాచిత్రాలు, ముద్రణ గుర్తులను ముద్రించారు. పురుషులు, మహిళలు, అవివాహితులు, వివాహితులు, వితంతువులను గుర్తించడానికి వేర్వేరు మార్కింగ్‌లు ఉండేవి. సమాచారం సేకరించిన అనంతరం, ఆ స్లిప్పులను వివిధ రంగులు, చిహ్నాల వారీగా వేరు చేసి లెక్కించేవారు. దీనివల్ల సంస్థానంలోని జనాభా మిశ్రమం, స్త్రీ-పురుష నిష్పత్తి లాంటి కీలక గణాంకాలు చాలా ఖచ్చితంగా వెల్లడి అయ్యాయి.మీర్జా మెహదీ ఖాన్ తన అధికారిక నివేదిక 'సెన్సస్ ఆఫ్ ఇండియా 1901 (వాల్యూమ్ చీచీఎఎ - హైదరాబాద్)' లో పేర్కొన్నట్లుగా.. ఈ మోడిఫైడ్ బవేరియన్ విధానం హైదరాబాద్‌లో అద్భుత ఫలితాలను ఇచ్చింది. పాత పద్ధతితో పోలిస్తే ఈ రంగుల కాగితాల లెక్కింపు వల్ల సమయం, శ్రమ, ప్రభుత్వ ధనం భారీగా ఆదా అయ్యాయి. అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని తక్కువ ఖర్చుతో క్రోడీకరించడంలో నిజాం రాచరిక రాష్ట్రం సాధించిన ఈ ప్రయోగం నాటి భారతదేశ జనాభా గణన చరిత్రలోనే ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోయింది.

# మెట్రో కష్టాలు ఇంతింతకాదయా



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయంలో ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ, తర్వాత కేంద్రం అడ్డుపడుతోందని ఆరోపిస్తున్నారు. ఇది రాజకీయ డైవర్షన్‌గా మారిందని విమర్శలు వస్తున్నాయి. అయితే వాస్తవాలు, ఆర్థిక సవాళ్లు, కేంద్ర?రాష్ట్ర సంబంధాలను పరిశీలిస్తే ఈ విషయం మరింత సంక్లిష్టంగా కనిపిస్తుందిహైదరాబాద్ మెట్రో ఫేజ్?1ను ఎల్అండ్‌టీ నిర్వహిస్తోంది. ఇది నష్టాల్లో ఉండటం, ఆర్థిక భారం కారణంగా లీజ్ వదులుకోవాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ద్వారా 100 శాతం ఈక్విటీని సొంతం చేసుకుంది. ఇందుకు సుమారు రూ.1,461 కోట్లు ఖర్చు అయింది. ఎల్అండ్‌టీకి చెల్లించాల్సిన బకాయిలు, రుణాలు క్లియర్ చేయడం ఈ టేకోవర్‌కు ముఖ్య కారణం. ఇది ఫేజ్?2 విస్తరణకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఎవరూ సూచించకుండానే టేకోవర్ చేశారని, రాజకీయ నేపథ్యం ఉందని విమర్శలు ఉన్నాయి.రూ.13,600 కోట్ల వరకు ఉన్న రుణాలు, ఇవి ఇంతకు ముందు బ్యాంకుల నుంచి 8.25% వడ్డీకి తీసుకున్నవి. ప్రభుత్వం ఇప్పుడు ఐఆర్ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా రీఫైనాన్సింగ్ చేయాలని చూస్తోంది. దీనిలో 4% వడ్డీకి జపాన్ నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంది. కేంద్రం ఎఫ్ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనల ప్రకారం రుణం తీసుకోవాలని సూచిస్తోంది. ఇలా చేస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇంకా దెబ్బతింటుంది. ఉద్యోగుల జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరత ఏర్పడవచ్చు. రాష్ట్ర హామీతో రుణం తీసుకుంటే అది రాష్ట్ర బడ్జెట్‌పై భారం అవుతుంది. ఇది టేకోవర్‌ను ఆర్థికంగా సవాలుగా మార్చింది.మెట్రో ఫేజ్?2 (సుమారు 123 కి.మీ.,రూ.38,595 కోట్లు) కోసం రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి నిధులు, ఆమోదాలు కోరుతున్నారు. ఇంతకు ముందు 50:50 భాగస్వామ్యంగా ఒప్పందం జరిగిందని చెబుతున్నారు. కానీ యూనియన్ మినిస్టర్ గిరి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఫేజ్?2కు నిధులు తీసుకురావడం ద్వారా టేకోవర్ బకాయిలు చెల్లించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. కిషన్ రెడ్డి మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పాటించడం లేదు, ఆర్థిక బాధ్యతలు తీసుకోవడం లేదు అని ఆరోపిస్తున్నారు. వాదనలు వస్తున్నాయి. ఇది కేంద్ర?రాష్ట్ర రాజకీయాల్లో భాగమైంది. మెట్రో ఫేజ్?2 విస్తరణ ట్రాఫిక్ సమస్యలను తగ్గించవచ్చు. అయితే ఆర్థిక భారం, రుణాలు, కేంద్ర నిబంధనలు ఇది సులభం కాదని చూపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం టేకోవర్‌ను గొప్ప విజయంగా చిత్రించి, తర్వాత కేంద్రం మీద బాధ్యత వేయడం రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. అదే సమయంలో కిషన్‌రెడ్డి, కేంద్రం వైపు నుంచి రాష్ట్రం నిబంధనలు పాటించాలని, ఆర్థిక బాధ్యత తీసుకోవాలని ఒత్తిడి చేయడం సహజం. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్రాలు కలిసి చేయాల్సినది. రాజకీయ ఆరోపణలు, డైవర్షన్‌లు పక్కన పెట్టి, ఆర్థిక వాస్తవాలు, ప్రజా ప్రయోజనం ఆధారంగా ముందుకు సాగాలి. హైదరాబాద్ వంటి నగరానికి మెట్రో విస్తరణ అవసరం ఉంది, కానీ అది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీయకుండా జరగాలి.ఇలాంటి పెద్ద ప్రాజెక్టుల్లో రాజకీయాలు అనివార్యం. కానీ ప్రజలు ఫలితాలు చూడాలని కోరుకుంటారు. మెట్రో విస్తరణ, మెరుగైన రవాణా. రెండు పక్షాలు సహకరించి, సమస్యలను పరిష్కరించుకోవాలి. అప్పుడే ఈ టేకోవర్ నిజమైన అభివృద్ధికి దారితీస్తుంది.

## సర్-2026 జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందే..

**హైద్రాబాద్ :** సర్-2026 (ప్రత్యేక సమగ్రసవరణ(సర్)జాబితాలో మీ పేరు ఉండాలంటే ఎన్యుమరేషన్ ఫారం తప్పకుండా నింపాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏళ్లుగా ఓటేస్తున్నామంటే అలా కుదరదని స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టే ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమంలో భాగంగా ఇలా చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి(డీఈవో), జీహెచ్?ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి హైదరబాద్ మహానగరంలో ఓటరు పత్రాల పంపిణీ మొదలవుతుందని, జులై 24న ముగుస్తుందని తెలిపారు. నెలరోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలు నింపినవారి వివరాలతో మాత్రమే ముసాయిదా ఓటరు జాబితా తయారవుతుంది. ముసాయిదాలోని ఓట్లపై నెల రోజుల పాటు ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్న ఆయన ఆయా ఓటర్లకు నోటీసులు ఇస్తామని చెప్పారు. ఓటరు తగు పత్రాలను అందజేస్తే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు.

**గుర్తింపు కార్డుల అవసరం లేదు**

అక్టోబరు 1, 2026న తుది ఓటరుజాబితా ముద్రిస్తామని, ముసాయిదా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను కూడా ప్రకటిస్తామన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ ఇంటికి వచ్చిన సమయానికి తాళం వేసి ఉంటే తలుపు, కిటికీల నుంచి పత్రాలను లోపలికి వేస్తారని పేర్కొన్నారు. వాటిలో వివరాలు నింపి సిద్ధంగా ఉంచుకోవాలన్న ఆయన మరో రోజు బీఎల్వో వచ్చి పత్రాలను తీసుకుంటారని పేర్కొన్నారు. ఎన్యుమరేషన్ పత్రాలతో ఎలాంటి గుర్తింపు కార్డులను ఇవ్వాల్సిన అవసరం లేదు.

**జాబితాలో పేరు లేకుంటే?**

ఎన్యుమరేషన్ పత్రాన్ని అధికారులు ఇవ్వరు. వారు ఓటరుగా నమోదయ్యేందుకు ఎప్పటిలాగే ఫారం-6 నింపాల్సి ఉంటుంది. వారికి సర్-2026 సర్వేతో ఎటువంటి సంబంధం ఉండదు. ఇటీవల ఎన్నికల్లో ఓటు వేసిన నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి ఇల్లు మారిన ఓటర్లకు కూడా ఎన్యుమరేషన్ పత్రం ఇచ్చేది ఉండదు. ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డులోని అడ్రస్?లోనే సదరు వ్యక్తులు ఎన్యుమరేషన్ ఫారం అందుకోవాలి. ఆ చిరునామాతోనే వివరాలను నింపి ఇవ్వాలి. హైదరాబాద్ నగరంలో వివిధ రాష్ట్రాల ఓటర్లను దృష్టిలో ఉంచుకుని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు ఇంగ్లీష్?లో ముద్రించిన ఎన్యుమరేషన్ పత్రాన్ని పంపిణీ చేస్తున్నారు.

**ఓటరు సంతకం చేయాలి**

ఎన్యుమరేషన్ పత్రంలో నింపిన వివరాలు సరైనవని తెలుపుతూ ఓటరు లేదా ఓటరు కుటుంబ సభ్యులు సంతకం చేయాల్సి ఉంటుంది. జూనియర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందిని బీఎల్వోలుగా నియమించారు.వారు ప్రతి పత్రాన్ని పరిశీలించి అందులోని వివరాలను బీఎల్వో యాప్‌లో నమోదు చేస్తారన్న ఆయన బీఎల్వో అప్‌లోడ్ చేసే వివరాలను సహాయ ఈఆర్వో, ఈఆర్వోలు ఆమోదిస్తారు. వారికి ఏ మాత్రం అనుమానం వచ్చినా సదరు ఓటరుకు నోటీసు వెళ్తుందని. అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకు అవసరమైన పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

## ఏసీబీ చేతిలో అవినీతి తిమింగళం

**హైదరాబాద్ :** తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటను యాంటీ కరప్షన్ బ్యూరో మరింత ఉధృతం చేసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే నమ్మదగిన సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మల్లా రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఏసీబీ అధికారులు మంగళవారం ఉదయం ఏకకాలంలో మెరుపు దాడులు ప్రారంభించారు. మల్లా రెడ్డి అక్రమాస్తుల గుట్టు రట్టు చేసేందుకు ఏసీబీ ఏకంగా 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. హైదరాబాద్‌లోని మాచ బొల్లారంలో ఉన్న ఆయన నివాసంతో పాటు నిజామాబాద్‌లోని ఆయన కార్యాలయం, నివాసాలపై అధికారులు విరుచుకుపడ్డారు. వీటితో పాటు మల్లా రెడ్డికి అత్యంత ఆప్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీలుగా అనుమానిస్తున్న వారి ఇళ్లు, వ్యాపార సంస్థల్లోనూ ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.తన అధికారిక ఆదాయ వనరులకు మించి మల్లా రెడ్డి భారీగా ఆస్తులను కూడబెట్టారనే బలమైన ఆరోపణలు, ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ ఈ కేసు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తులో ఆయన పెద్ద ఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో, కోర్టు అనుమతితో ఈ సర్ప్రైజ్ రైడ్స్ ప్లాన్ చేశారు. సోదాల సందర్భంగా అధికారులు ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంక్ పాస్‌బుక్కులు, బంగారు ఆభరణాలు, భారీగా నగదును గుర్తించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ, ల్యాండ్ డాక్యుమెంట్లు, బ్యాంకు లాకర్ల వివరాలు మరియు ఇతర ఆర్థిక లావాదేవీల రికార్డులను ఏసీబీ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మల్లా రెడ్డి సర్వీస్ కాలంలో సంపాదించిన చట్టబద్ధమైన ఆదాయానికి, ప్రస్తుతం దొరికిన ఆస్తుల విలువకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కగట్టే పనిలో అధికారులు నిమగ్నమయ్యారుఒక కీలక జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అధికారి నివాసాలపై ఈ స్థాయిలో ఏసీబీ దాడులు జరగడం కలకలం రేపుతోంది. సోదాలు పూర్తిగా ముగిసిన తర్వాత మల్లా రెడ్డి అక్రమాస్తుల అసలు విలువ ఎంత? ఎక్కడెక్కడ బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారు? అనే పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు. అక్రమాలు రుజువైతే ఆయనపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏటీఎంకు వచ్చిన డబ్బులు మాయం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## స్కీం వెనుక స్కాం- కేటీఆర్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు.మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## సంపాదకీయం

# ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక శక్తి.. 10 ఏళ్లలో ఏడుగురు ప్రధానులు


ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన దేశం. పారిశ్రామిక విప్లవానికి పుట్టినిల్లు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువు. అలాంటి బ్రిటన్ (యూకే) నేడు తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ప్రపంచంలో అత్యంత అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరున్న యునైటెడ్ కింగ్‌డమ్ ప్రస్తుతం వృద్ధి మందగమనం, అధిక రుణభారం, జీవన వ్యయాల పెరుగుదల, ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడి, వలసల సమస్యలు, ఉత్పాదకత తగ్గుదల వంటి అనేక సవాళ్లతో పోరాడుతోంది.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని కలిగి ఉన్న దేశం ఈ పరిస్థితికి ఎలా చేరుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం గత కొన్ని దశాబ్దాల విధాన నిర్ణయాలు, రాజకీయ పరిణామాలు, ప్రపంచీకరణ ప్రభావాలు ఇంకా నిర్మాణాత్మక బలహీనతల్లో దాగి ఉంది.బ్రిటన్ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న తీవ్ర అస్థిరత మరోసారి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బ్రిటన్ తాజా ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తన పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేయకుండానే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో గత 10 ఏళ్ల వ్యవధిలోనే బ్రిటన్ ఏకంగా ఆరుగురు ప్రధాన మంత్రులను మార్చినట్లయింది. ఒకప్పుడు ప్రపంచాన్ని శాసించిన ఒక అగ్రదేశంలో ఈ స్థాయి రాజకీయ సంక్షోభం తలెత్తడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్థిరత్వంపై సరికొత్త చర్చకు దారితీస్తోంది.బ్రిటన్ రాజకీయాల చరిత్రను గమనిస్తే.. 2016 లో జరిగిన బ్రెక్సిట్ రెఫరెండం తర్వాత అక్కడ స్థిరమైన ప్రభుత్వం అనేది లేకుండా మారింది. నాటి ప్రధాని డేవిడ్ కామెరూన్ రాజీనామా తర్వాత తెరిసా మే, ఆపై బోరిస్ జాన్సన్, కేవలం 45 రోజులు మాత్రమే పదవిలో ఉన్న లిజ్ ట్రస్, ఆ తర్వాత భారత సంతతికి చెందిన రిషి సునక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు పదవుల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఇటీవలే లేబర్ పార్టీని భారీ విజయంతో అధికారంలోకి తెచ్చిన కీర్ స్టార్మర్ సైతం దేశంలోని ఆర్థిక సవాళ్లు, అంతర్గత రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఐదేళ్ల పూర్తి టర్మ్ ముగియకుండానే తప్పుకోవడంతో బ్రిటన్ పతనావస్థకు ఈ సంక్షోభం అద్దం పడుతోంది.సరిగ్గా ఇదే 10 ఏళ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం సాధించిన రాజకీయ స్థిరత్వాన్ని ఇక్కడి పరిణామాలతో పోల్చి చూపిస్తున్నారు. లండన్ వీధుల్లో ప్రధానుల మార్పిడి ఒక ప్రహసనంగా మారిన తరుణంలో.. భారత్‌లో మాత్రం ఇదే దశాబ్ద కాలంలో కేవలం ఒకే ఒక్క ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో స్థిరమైన పరిపాలన సాగుతోంది. ఈ రాజకీయ స్థిరత్వమే అంతర్జాతీయంగా భారతదేశ ఆర్థిక వృద్ధికి, దౌత్యపరమైన విజయాలకు ప్రధాన ఇంధనంగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఒకవైపు బ్రిటన్ వంటి సంప్రదాయ ప్రజాస్వామ్య దేశాలు నాయకత్వ మార్పులతో, విధానపరమైన అస్థిరతతో కొట్టుమిట్టాడుతుంటే.. భారతదేశం వరుసగా మూడోసారి ఒకే నాయకత్వాన్ని ఎన్నుకుని స్థిరమైన విధానాలతో ముందుకు సాగుతోంది. కీర్ స్టార్మర్ రాజీనామాతో బ్రిటన్ తదుపరి ప్రధాని ఎవరనే ఉత్కంఠ నెలకొనగా.. గ్లోబల్ ఇన్వెస్టర్లు మాత్రం స్థిరత్వానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన భారత్ వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయి.20వ శతాబ్దం మధ్య వరకు బ్రిటన్ తయారీ రంగంలో అగ్రగామిగా ఉండేది. అయితే కాలక్రమేణా భారీ పరిశ్రమలు క్షీణించాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఫైనాన్స్, బ్యాంకింగ్, సేవల రంగాలపై ఆధారపడిపోయింది.ప్రత్యేకించి లండన్ నగరం ప్రపంచ ఆర్థిక కేంద్రంగా ఎదిగింది. కానీ ఈ మార్పు దేశంలోని మిగతా ప్రాంతాలకు సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయింది. ఫలితంగా లండన్ అభివృద్ధి చెందుతుండగా, ఇతర ప్రాంతాలు వెనుకబడ్డాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పరిస్థితులు మారడం ప్రారంభమయ్యాయి. అమెరికా ఆ తరువాత చైనా వంటి దేశాలు ఆర్థికంగా బలపడటంతో బ్రిటన్ తన ఆధిపత్యాన్ని క్రమంగా కోల్పోయింది. అయినప్పటికీ, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగం, విద్య, సాంకేతికత వంటి రంగాల ద్వారా ప్రపంచంలో ప్రాధాన్య స్థానాన్ని కొనసాగించింది.బ్రిటన్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఉత్పాదక రంగం బలహీనపడటం. గత మూడు దశాబ్దాలుగా తయారీ పరిశ్రమల ప్రాధాన్యం తగ్గిపోయింది. పరిశ్రమలు తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయగల దేశాలకు తరలిపోయాయి.దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ అధికంగా ఫైనాన్షియల్ సర్వీసులపై ఆధారపడిపోయింది.ముఖ్యంగా లండన్ నగరం కేంద్రంగా బ్యాంకింగ్,ఇన్వెస్ట్‌మెంట్ రంగాలు విస్తరించాయి.కానీ ఈ రంగాలు దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధిని తీసుకురాలేకపోయాయి.లండన్ సంపన్నంగా మారుతుంటే, ఇతర ప్రాంతాలు వెనుకబడిపోయాయి.2008 ప్రపంచ ఆర్థిక మాంద్యం బ్రిటన్‌కు పెద్ద దెబ్బగా మారింది.బ్యాంకింగ్ రంగంపై అధిక ఆధారపడటం కారణంగా ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది.ఆ తర్వాత ప్రభుత్వం భారీ వ్యయ నియంత్రణ విధానాలను అమలు చేసింది. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం వల్ల ఆరోగ్యం, విద్య, స్థానిక సంస్థలు, సామాజిక సంక్షేమ రంగాలు నిధుల కొరతను ఎదుర్కొన్నాయి.ఈ ప్రభావం ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది. ప్రజా సేవల నాణ్యత క్రమంగా పడిపోయింది.బ్రిటన్ ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే దీర్ఘకాలిక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం.ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించడం, టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెంచడం,గృహ నిర్మాణాలను వేగవంతం చేయడం,విద్య నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టడం కీలకం.అలాగే ప్రాంతీయ అసమానతలను తగ్గించి లండన్ వెలుపల ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.బ్రిటన్ ఒక్కసారిగా కుప్పకూలిపోతున్న దేశం కాదు. కానీ గత కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక సమస్యలు ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచాన్ని నడిపించిన దేశం, నేడు తన ఆర్థిక భవిష్యత్తును తిరిగి నిర్వచించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభం నుంచి బయటపడగలదా లేదా అనేది రాబోయే సంవత్సరాల్లో తీసుకునే రాజకీయ, ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మాత్రం బ్రిటన్ ఒక కీలక మలుపు వద్ద నిలబడి ఉంది.

# బీజేపీ చీలిక రాజకీయం



విలువల రాజకీయాలంటూ ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ గత పన్నెండేండ్ల పైచిలుకు పాలనలో ప్రతినిత్యం విలువలకు పాతరేస్తూ వచ్చింది. వికృత రాజకీయ క్రీడలో కాంగ్రెస్ కన్నా రెండాకులు ఎక్కువే చదివి విపరీత పోకడలు పోతున్నది. ఇప్పుడు తన ప్రత్యేక ఎజెండాసాధనకు వేస్తున్న ఎత్తుగడల్లో భాగంగా ప్రజాస్వామ్యాన్ని ప్రహసనంగా మారుస్తున్నది. కశ్మీర్‌కు సంబంధించిన 370 అధికరణం ఎత్తివేయడం, ప్రణాళికా సంఘాన్ని మూలకు నెట్టడం వంటివి ఈ సరికే సాధించుకోగలిగింది. ఏమాత్రం అవకాశం దొరికినా ఇంకా చాలానే చేయాలనేది బీజేపీ అత్యాశ. ఒకే దేశం ఒకే ఎన్నిక, ఒకే విధానం, ఒకే నేత.. ఇలా లిస్టు చాలా పెద్దదే. మోదీ మొదటిసారికన్నా రెండోసారి మెజారిటీ పెంచుకున్నారు. అదే ఊపు అలాగే కొనసాగి మూడో విడుతలో 400 మార్కు దాటుతామేమోనని కమలదళానికి ఆశ కూడా కలిగింది. అయితే ఓటర్లు ఆ పార్టీకి ఉన్న మెజారిటీని ఊడగొట్టి మూలకు నెట్టారు. అయితేనేం..ఇతర పార్టీల మద్దతుతో కేంద్రంలో అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది బీజేపీ. ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ఆమోదింప జేసుకోవడం తక్షణ కర్తవ్యంగా ఉన్నదన్నది బహిరంగ రహస్యమే. అందుకు అవసరమైన బలం పెంచుకునేందుకు నానా గడ్డి మేస్తున్నది. ఒకప్పుడు కాంగ్రెస్ నిస్సిగ్గుగా పాల్పడిన రాజకీయ అకృత్యాలన్నిటినీ ఇప్పుడు అనుసరిస్తున్నది. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడే బీజేపీ ఆ విలువలను కట్టగట్టి అటకెక్కిస్తున్నది. గవర్నర్ల వ్యవస్థను భ్రష్టుపట్టించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు దుర్వినియోగపరుస్తున్నది. న్యాయవ్యవస్థపై పట్టుకోసం జాతీయ న్యాయ నియామక మండలి (ఎన్ జాక్) తీసుకువచ్చి సుప్రీంకోర్టు తిరస్కరణతో చేతులు కాల్చుకున్నది. ఇప్పుడు పార్లమెంటులో తమ బలం పెంచుకునేందుకు విపక్షాలను చీల్చేందుకు అనైతిక ఎత్తుగడలను అమలు చేస్తున్నది. మరో రెండేండ్లలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో సొంతంగా బలం పెంచుకునేందుకు నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులే దిక్కని బీజేపీ గట్టిగా నమ్ముతున్నట్టున్నది. అయితే ఆ బిల్లులను ఒడ్డున పడేయాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. ఆ మేరకు పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ కూడా లేదనే సంగతి తెలిసిందే. మొన్నటికి మొన్న బెంగాల్ ఎన్నికల ముందు నాటకీయమైన రీతిలో ఆ బిల్లులను కలగలిపి ప్రవేశపెట్టి అపజయాన్ని మూటగట్టుకున్నది. దేశంపై రాజకీయంగా తన పట్టు బిగించేందుకు పై రెండు బిల్లులు సానుకూల వాతావరణం తీసుకువస్తాయని బీజేపీ భావన. అందుకు విపక్షాలను చీల్చే అప్రతిష్ఠాకరమైన ఎత్తుగడలకు పాల్పడుతున్నది. బెంగాల్ ఎన్నికల దరిమిలా తృణమూల్‌ను నిలువునా చీల్చింది. ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు వేరుకుంపటి పెట్టారు. వారు నేరుగా బీజేపీలో చేరకుండా అధికారికంగా నమోదు కాని త్రిపురకు చెందిన ఎన్సీపీఐ (నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)లో చేరారు. అయితే వారు ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం మాత్రం మరువలేదు. దీనిని బట్టే టీఎంసీ చీలిక వెనుక ఎవరున్నదీ చెప్పకనే తెలిసిపోతున్నది. ఢిల్లీలో ఆప్ నుంచి మొదలుకొని మహారాష్ట్రలో ఎన్సీపీ దాకా బీజేపీ చీలిక ఎత్తుగడలకు బలికాని ప్రాంతీయ పార్టీలు దేశంలో బహు తక్కువగా మిగిలి ఉన్నాయి. తాజాగా మహారాష్ట్రలో శివసేన చీలికవర్గంలో మరో చీలికకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గంలో ఉన్న 9 మంది ఎంపీల్లో ఆరుగురు మహారాష్ట్ర బీజేపీ కూటమిలో భాగస్వామిగా ఉన్న షిండే వర్గంలో చేరుతామని అంటున్నారు. ఈ చీలిక వెనుక బీజేపీ పాత్రను రుజువు చేయడానికి ఇంతకన్నా సాక్ష్యాలు కావాలా? అంతా బహిరంగ రహస్యమే. పైగా ఫిరాయింపు ఎంపీలకు పెద్ద ఎత్తున డబ్బు ఆశ చూపారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండటం గమనార్హం. మరోవైపు ఎన్నికల వ్యవస్థను అడ్డు పెట్టుకుని తమవారిని పార్లమెంటుకు పంపే ఎత్తుగడలకూ బీజేపీ వెనుకాడటం లేదు. విలువల పేరిట కాంగ్రెస్‌పై పోరాడినట్టు దేశాన్ని మభ్యపెట్టిన బీజేపీ అదే కాంగ్రెస్ బాటలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుండటం విడ్డూరం. అందుకు కాంగ్రెస్ తెచ్చిన ఫిరాయింపు వ్యతిరేక చట్టం ఓ సాధనంలా మారడం మరీ విడ్డూరం.

# మరస్పర్శ మానవస్పర్శను మించగలదా!



భారతదేశపు నేటి రాజకీయ నాయకులకు 'కృత్రిమ మేధ' ఒక ఊతపదమైపోయింది. కొందరైతే అనాదిగా వస్తున్న 'మానవ కేంద్రీకృత ప్రజారోగ్య సంరక్షణ' కంటే ఈ కృత్రిమమేధతో కూడిన మరబొమ్మల వైద్య సంరక్షణే మెరుగన్న ఆపోహతో మాట్లాడుతున్నారు. ఇదిగో పులి అంటే అదిగో తోక అన్నట్టు, ఏకంగా భవిష్యత్తులో కృత్రిమమేధతో కూడిన ఆసుపత్రులు, రోగ పరీక్షా కేంద్రాలు, మందుల దుకాణాలూ తెరిచేస్తామనే బీరాలు పలికేంతవరకూ విషయం వెళ్లిపోయింది. వైద్య విధానమంతా ఇద్దరు వ్యక్తులతో ముడిపడి ఉంటుంది. మొదటి వ్యక్తి-- నిజంగా రుగ్మత ఉన్న, లేదా ఉందని భావిస్తున్న రోగి. రెండో వ్యక్తి-- వైద్యుడు. వీరిరువురి మధ్య వ్యవహారాన్నే వైద్య పరిభాషలో మనం సంప్రదింపు (కన్సల్టేషన్) అంటున్నాం. ఆధునిక వైద్య చికిత్సా విధివిధానం ఇలా ప్రాథమికంగా వినడం, మాట్లాడటం, స్పృశించడం, వైద్యునికీ రోగికీ నడుమ కాలాతీతమైన ఒక బాంధవ్యాన్ని నెలకొల్పడం అనే నాలుగు మూలస్తంభాలపై ఆధారపడి ఉంది. టెక్నాలజీ పెరిగేకొద్దీ ఈ విధానంలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు వైద్యుడు రోగితో మాట్లాడే సమయం తగ్గిపోయింది. దానికి బదులుగా, ఉక్కిరిబిక్కిరి చేసే మెడికల్ టెస్టుల ఆధారంగా రోగాన్ని నిర్ధారించడం పెరిగింది. ఇప్పుడు ఈ పరిస్థితిలోకి అదనంగా కృత్రిమమేధను కూడా చొప్పిస్తే అది గోరుచుట్టు మీద రోకలిపోటయ్యే ప్రమాదం ఉన్నది. వైద్యుడు--రోగి ఇరువురూ రోగనిదాన క్రియలో ఎంతో కీలకం. రోగి బెడ్ వద్దకు వైద్యుడు ఆత్మీయంగా చేరగానే రోగికి కొండంత అండ దొరికినట్టు ఉంటుంది. వైద్యుడి స్పర్శ రోగి దేహానికి అమృత సమానంగా, వైద్యుడి మాట రోగి మనసుపై మంత్రంగా పనిచేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వసనీయమైన వైద్యుడు రోగికి ప్రసాదించే ఆ ఒక్క కరస్పర్శ-- సంజీవిని. అలాంటిది, ఒక రోబోటిక్ స్పర్శ ఈ సజీవ స్పర్శకు సరితూగుతుందా? అసలైన మానవ స్పర్శను సమూలంగా తొలగించి ఆ లోటును భర్తీ చేయగలుగుతుందా?

ఆధునిక చికిత్సా విధానంలో వైద్యుడు నిర్వహించే మరో పార్శ్వం కూడా ఉంది. రోగనిర్ధారణకు ప్రామాణికాలుగా ఎన్నో విధివిధానాలు, దశలవారీ సూచనలు ఉపలభ్యం అవుతూ ఉండొచ్చు. కానీ అనుభవజ్ఞుడైన వైద్యుడు వీటన్నింటినీ గుడ్డిగా అనుసరించడు. తన తెలివినీ, విజ్ఞానాన్నీ, ఏళ్ల తరబడి గడించిన అపారమైన అనుభవాన్నీ రంగరించి ఒక్కొక్క రోగికీ సంబంధించిన రుగ్మతను అతడి ప్రత్యేక శరీర ధర్మానుగుణంగా నిర్ధారిస్తాడు. హెచ్చుతగ్గులను బేరీజు వేసి మరీ తగిన చికిత్సను సూచిస్తాడు. ఎందుకంటే, అన్నింటినీ ఒకే రాటకు కట్టలేం. ఒకే రోగానికి వేరు వేరు వ్యక్తులు వేరు వేరు విధంగా ప్రతిస్పందిస్తారు. ఆ స్పందించిన తీరుపై ఆధారపడి వైద్యుడి చికిత్స ఉంటుంది. అది ఎప్పుడూ ఎవరికి తగ్గట్టు వారికిగా వ్యక్తిగతీకరించబడి ఉంటుంది. అంతేతప్ప, జనసామాన్యంగా, 'పిడుగుకు, బియ్యానికి ఒకే మంత్రం'లా, ఒక మూసలో పోసినట్టు ఉండదు. ఇలాంటి నైశిత్యం మరమనిషి తరం కాదు! సమగ్ర బుద్ధితో, సందర్భ శుద్ధితో, ఏళ్ల తరబడి అనుభవంతో వైద్యుడు చేసే రోగ నిర్ధారణ విధానంతో కృత్రిమ మేధ ఎన్నటికీ తలపడలేదు. తన విషయ సంపదతో రోగనిర్ధారణ సమయంలో కచ్చితత్వానికి కొంత ఆలంబనగానూ, శస్త్ర చికిత్సలో మర చేతుల చేత సునిశితత్వాన్ని సాధించే ఒక విలువైన పనిముట్టుగానూ మాత్రమే ఆధునిక వైద్యుడికి ఈ కృత్రిమమేధ ఉపయోగపడుతుంది. ఆ పరిధికి మాత్రమే కృత్రిమమేధ ఉపయోగాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, నేటి వైద్యంలో అవధులు దాటిన కృత్రిమమేధ వినియోగం సృష్టించే ఆపదలు ఎన్నో మనం ఇప్పటికే కళ్లారా చూస్తున్నాం, చెవులారా వింటున్నాం. కొందరు రోగులు కృత్రిమ మేధ సహాయంతో తమకు తామే రోగ నిర్ధారణను పూర్తి చేసేసుకుని, ఆ తర్వాత మొక్కుబడిగా, 'శంఖంలో పోస్తేనే గానీ తీర్థం కాదన్న'ట్టుగా మాత్రమే వైద్యుడి దగ్గరకు వస్తున్నారు. ఈ ఒరవడి ఎంతో ప్రమాదకరం. నా స్వానుభవం ఒకటి ఇక్కడ చెప్పదలచాను. ఒక మహిళకు మొహం మీద పెద్ద ప్రమాదం లేని దద్దుర్లు వచ్చాయి. కానీ ఆమె కృత్రిమ మేధను వాడి ఆ దద్దుర్లను 'సిస్టెమిక్ లూపస్ ఎరితమటోసిస్' (రాజు) అనే భయంకరమైన ఆటో ఇమ్యూన్ వ్యాధిగా నమ్మింది. ఎంత నచ్చచెప్పినా ఆమె వినలేదు. చివరికి అది రాజు కాదని తేల్చడానికి అనవసరంగా ఎన్నో పరీక్షలను ఆమెకు చేయించాల్సి వచ్చింది. ఆ ఫలితాలన్నీ నెగెటివ్‌గా వచ్చాక గానీ ఆమె ఊపిరి పీల్చుకోలేదు. ఇలా కృత్రిమమేధపై పూర్తిగా ఆధారపడిపోయిన అజ్ఞానంతో ఎందరో అనవసర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు. కృత్రిమమేధ ఆధునిక వైద్య విజ్ఞానాన్ని మెరుగుపరిచే ఒక అనుబంధంగా ఉపయుక్తం కావచ్చు. కానీ దాని స్థానాన్ని పూర్తిగా ఆక్రమించగలిగే ఒక ప్రత్యామ్నాయం మాత్రం ఎన్నటికీ కాలేదు. ఇది ముమ్మాటికి నిజం.

# చీలిక దిశగా సమాజ్ వాదీ పార్టీ


తృణమూల్ కాంగ్రెస్ లో చీలికలు, శివసేన ఉద్ధవ్ వర్గంలో చీలికలు.. తాజాగా మరో పార్టీ కూడా చీలిక దిశగా ప్రయాణిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదే సమాజ్ వాదీ పార్టీ. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ వార్త పెద్ద సంచలనం రేపుతోంది.సమాజ్ వాదీ ఎంపీలంతా బీజేపీ వైపు చూస్తున్నట్లు మంత్రి ఓం ప్రకాశ్ రాజ్ భర్ పెద్ద బాంబు పేల్చారు. దీంతో దేశ రాజకీయాలు ఆసక్తిగా మారాయి.సమాజ్ వాదీ పార్టీలో భారీ చీలిక తప్పదని, ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు ఇప్పటికే బీజేపీ వైపు వెళ్లేందుకు సిద్ధంగా వున్నారంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. మహారాష్ట్రపైనే దృష్టి పెట్టొద్దని, ఇప్పుడు యూపీ వంతు వచ్చిందంటూ వ్యాఖ్యానించారు. ఎవరైనా కొనుగోలు కావడానికి సిద్ధంగా వుంటేనే వారిని ఎవరైనా కొనుగోలు చేస్తారు. మహారాష్ట్ర గురించే కాకుండా యూపీ పై కూడా దృష్టి నిలపాలని మంత్రి అందులో పేర్కొన్నారు.సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నాయకుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి అయిన రామ్ గోపాల్ యాదవ్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి ఒక లేఖను అందజేశారని, ఆ లేఖ పార్టీలోని ఒక వర్గం బీజేపీలో చేరడానికి సిద్ధంగా ఉందనే సంకేతాన్ని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ విషయంపై సమాజ్‌వాదీ పార్టీ లేదా బీజేపీ నుండి ఎటువంటి స్పష్టతా రాలేదు.తృణమూల్ కాంగ్రెస్ లేదా శివసేన లో జరిగినట్లుగా, ఉత్తరప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన సమాజ్‌వాదీ పార్టీలో ప్రస్తుతం చీలిక వచ్చే అవకాశం లేదని అక్కడి రాజకీయ పరిశీలకులు మరియు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఇటీవల కొన్ని అంతర్గత విభేదాలు మాత్రం వున్నట్లు సమాచారం.027 ఎన్నికలకు ముందు టికెట్ల కేటాయింపు విషయంలో కొందరు నాయకుల మధ్య అసంతృప్తి తలెత్తే అవకాశం ఉందని, ఇది పార్టీ మరియు అఖిలేష్ ప్రణాళికలకు విఘాతం కలిగించవచ్చని వారు భావిస్తున్నారు. గత రాజ్యసభ ఎన్నికల్లో జరిగిన క్రాస్-వోటింగ్ ఉదంతాలతో కూడా పరిశీలకులు దీనిని ముడిపెడుతున్నారు.క్షణమే చీలిక వచ్చే సూచనలేవీ కనిపించనప్పటికీ, రాజ్‌భర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం ఖచ్చితంగా ఒక రకమైన ప్రకంపనలను రేకెత్తించాయి. ఏది ఏమైనా, రాజకీయాల్లో ఏం జరుగుతుందో అంచనా వేయడం కష్టం; ఎప్పుడు మిత్రులు అకస్మాత్తుగా శత్రువులుగా మారుతారో, లేదా ఎప్పుడు చిరకాల రాజకీయ ప్రత్యర్థులు ఊహించని విధంగా మిత్రులుగా మారతారో ఎవరూ చెప్పలేంఅయితే, ఒకవేళ ఎస్పీలో చీలిక ఏర్పడితే, దాని ప్రభావం ప్రధానంగా వచ్చే ఏడాది?అంటే 2027లో?జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై పడుతుంది. అంతేకాకుండా, పార్లమెంటరీ సమీకరణాలు కూడా మారవచ్చు. ప్రస్తుతం రాజ్యసభలో ఎస్పీ ప్రధాన ప్రతిపక్ష పార్టీలలో ఒకటిగా ఉంది, అలాగే రామ్ గోపాల్ యాదవ్ ఆ పార్టీకి చెందిన ప్రముఖ వ్యక్తి మరియు బలమైన గొంతుకగా ఉన్నారు. రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీకి మొత్తం నలుగురు ఎంపీలు ఉన్నారు. ఒకవేళ పెద్ద సంఖ్యలో రాజ్యసభ ఎంపీలు పార్టీ మారితే, సభలో ప్రతిపక్షం బలహీనపడి, ప్రభుత్వం తన బిల్లులను సులభంగా ఆమోదించుకునే అవకాశం ఏర్పడుతుంది.



# బాదం పప్పులు.. ఇలా తిన్నారంటే బంపర్ బెనిఫిట్స్?

మనం సాధారణంగా బాదం పప్పులను నానబెట్టి తింటాము. బాదం పప్పులు మేధస్సును పెంచుతాయని మనందరికీ తెలుసు. అయితే, వీటిని తినే పద్ధతిలో చిన్న మార్పు చేయడం వల్ల రెట్టింపు ప్రయోజనాలను పొందవచ్చు. అందుకే మీరు ఎప్పుడైనా ఉడకబెట్టిన లేదా బ్లాంచ్ చేసిన బాదం పప్పులు తిన్నారా..? దీని వల్ల కలిగే ప్రయోజనాలు, వాటిని తయారు చేసే విధానం గురించి ఇక్కడ ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి. బాదంను పొట్టు తీసి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇక్కడ ఉన్నాయి. బ్లాంచ్డ్ బాదం అంటే ఏమిటి?: బాదం పప్పులను కొద్దిసేపు వేడి నీటిలో ఉడకబెట్టి, వాటి పొట్టును తొలగించడాన్నే బ్లాంచింగ్ అంటారు. ఈ పద్ధతి వల్ల బాదం పప్పులు మెత్తగా మారి, తినడానికి రుచిగా ఉంటాయి. బాదం పప్పులను ఉడకబెట్టడం వల్ల వాటిపై ఉండే పొట్టు సులభంగా విడిపోతుంది. ఈ పొట్టులో ఉండే టానిన్ అనే పదార్థం శరీరానికి పోషకాలు అందకుండా అడ్డుకుంటుంది. కాబట్టి బ్లాంచ్ చేసిన బాదం తినడం వల్ల శరీరానికి పూర్తిస్థాయిలో విటమిన్లు, ప్రోటీన్లు అందుతాయి. మెరుగైన జీర్ణక్రియ: బాదం పొట్టులో ఉండే టానిన్లు జీర్ణక్రియకు ఆటంకం కలిగిస్తాయి. ఉడకబెట్టిన బాదం పొట్టు లేకుండా ఉండటం వల్ల కడుపులో ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరగా జీర్ణమవుతాయి. చిన్నపిల్లలు, వృద్ధులకు ఇది ఉత్తమమైన పద్ధతి. ఉడకబెట్టిన బాదం పప్పులు జీర్ణం కావడానికి చాలా సులభంగా ఉంటాయి, ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ఇది ఎంతో మేలు చేస్తుంది. పోషకాల శోషణ: పొట్టు తీసిన బాదం తినడం వల్ల అందులోని విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులను శరీరం త్వరగా గ్రహిస్తుంది. ఇది గుండె ఆరోగ్యానికి, రక్తపోటు నియంత్రణకు సహాయపడుతుంది. ఉడకబెట్టిన బాదంలోని యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పెరుగుతాయని, ఇది చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా ఎంతో తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. వంటల్లో వినియోగం: బ్లాంచ్ చేసిన బాదంను మిక్సీ పట్టి బాదం పాలు లేదా స్వీట్లలో వాడటం వల్ల వంటకానికి మంచి రంగు, క్రీమీ టెక్చర్ వస్తుంది. నానబెట్టిన బాదం కంటే ఉడకబెట్టిన బాదం తింటే బాదంలోని అసలైన శక్తి శరీరానికి అందుతుందని నిపుణులు సూచిస్తున్నారు. మీరు బరువు తగ్గాలనుకున్నా లేదా మెదడు చురుగ్గా ఉండాలన్నా, ఈ పద్ధతిని ప్రయత్నించి చూడండి. తయారు చేసే విధానం: ఒక పాత్రలో నీటిని బాగా మరిగించండి. అందులో బాదం పప్పులను వేసి సరిగ్గా 60 నుండి 90 సెకన్ల పాటు ఉంచండి. వెంటనే వాటిని వడకట్టి, ఐస్ వాటర్ లేదా చల్లటి నీటిలో వేయండి. ఇప్పుడు మీ వేళ్లతో నొక్కితే పొట్టు సులభంగా వచ్చేస్తుంది.

# అల్జీమర్స్ ముప్పు ఆడవారికే ఎందుకు ఎక్కువ?



వయసు పైబడిన వారిలో కనిపించే అతిపెద్ద ఆరోగ్య సమస్య అల్జీమర్స్ అయితే, ఈ వ్యాధి పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అల్జీమర్స్ బాధితుల్లో మూడింట రెండు వంతులు మహిళలే ఉండటం గమనార్హం. అసలు దీనికి కారణాలు ఏంటి? సైన్స్ ఏం చెబుతోంది? మహిళల్లో హార్మోన్ల మార్పులు అల్జీమర్స్ ముప్పును పెంచుతాయి. ముఖ్యంగా మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పడిపోతాయి. మెదడు కణాలను రక్షించడంలో ఈస్ట్రోజెన్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ హార్మోన్ తగ్గడం వల్ల మెదడులో మార్పులు సంభవించి మతిమరుపుకు దారితీసే అవకాశం ఉంది. కొన్ని ప్రత్యేకమైన జన్యువులు మహిళలపైనే ఎక్కువ ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ంఖూఇ-4 అనే జన్యువు ఉన్న మహిళల్లో, అదే జన్యువు ఉన్న పురుషుల కంటే అల్జీమర్స్ వచ్చే రిస్క్ చాలా ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. సాధారణంగా పురుషుల కంటే మహిళలు ఎక్కువ కాలం జీవిస్తారు. అల్జీమర్స్ అనేది వయసుతో పాటు పెరిగే వ్యాధి. మహిళలు ఎక్కువ కాలం జీవించడం వల్ల వృద్ధాప్యంలో ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు కూడా సహజంగానే పెరుగుతున్నాయి. మహిళల మెదడులో గ్లూకోజ్ వినియోగం, శక్తి ఉత్పత్తి ప్రక్రియలు పురుషుల కంటే భిన్నంగా ఉంటాయి. మెనోపాజ్ దశలో మెదడుకు అందే శక్తి తగ్గడం వల్ల అమిలాయిడ్ ప్లాక్స్ వంటి వ్యర్థాలు మెదడులో పేరుకుపోయి జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తాయి. అల్జీమర్స్ నుంచి తప్పించుకోవడానికి లేదా దాని తీవ్రతను తగ్గించడానికి నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.దీనికోసం సరైన ఆహారం అవసరమని అంటున్నారు.మెదడు పనితీరును మెరుగుపరిచే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఆకుకూరలు తీసుకోవాలి.శారీరక శ్రమ మెదడుకు రక్త ప్రసరణను పెంచుతుంది.సుడోకు, పజిల్స్ పూర్తి చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా మెదడును యాక్టివ్‌గా ఉంచాలి.డాక్టర్ల సలహాతో మెనోపాజ్ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అల్జీమర్స్ అనేది కేవలం వృద్ధాప్య సమస్య మాత్రమే కాదు, మహిళల విషయంలో ఇది హార్మోన్లు మరియు జన్యువుల కలయిక. అందుకే మహిళలు 40 ఏళ్ల నుంచే తమ మెదడు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరం.

# టీ ఇలా తాగుతున్నారా?



చాలామందికి ఉదయం నిద్రలేవగానే వేడివేడి టీ కప్పుతో రోజును ప్రారంభించడం ఒక అలవాటు. ఆ ఛాయ్ పడకపోతే ప్రాణం లేవదని, బుర్ర పనిచేయదని అంటుంటారు. అయితే, పరగడుపున టీ తాగడం వల్ల మీ శరీరంలో కొన్ని ప్రతికూల శారీరక మార్పులు సంభవిస్తాయని మీకు తెలుసా? ఖాళీ కడుపుతో టీ తాగడం అనేది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, అది మీ జీర్ణవ్యవస్థను దెబ్బతీసే ప్రమాదకరమైన సంకేతం కూడా కావచ్చు. టీలో ఉండే కెఫీన్ శరీరానికి తక్షణమే ఉత్సాహాన్ని ఇస్తుందని మనం భావిస్తాం. కానీ, పరగడుపున దీనిని తీసుకోవడం వల్ల కడుపులో యాసిడ్ స్రావం ఒక్కసారిగా పెరుగుతుంది. దీనివల్ల అజీర్ణం, ఛాతీలో మంట మరియు కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ అలవాటును దీర్ఘకాలం పాటు కొనసాగిస్తే, కడుపు లోపల ఉండే సున్నితమైన పొర దెబ్బతిని, కడుపులో అల్సర్లు వచ్చే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీహైడ్రేషన్: రాత్రంతా నిద్రపోయి ఉదయం లేవగానే మన శరీరం సహజంగానే కొంత డీహైడ్రేషన్‌కు గురై ఉంటుంది. టీకి మూత్రవిసర్జనను ప్రేరేపించే గుణం ఉండటం వల్ల, ఖాళీ కడుపుతో దీనిని తాగినప్పుడు శరీరంలోని ద్రవాలు మరింత తగ్గిపోతాయి. దీనివల్ల రోజు మొదట్లోనే తీవ్రమైన అలసట, నీరసం మరియు తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామంది తమకు టీ తాగకపోవడం వల్ల తలనొప్పి వస్తుందని భావిస్తారు, కానీ వాస్తవానికి టీ వల్ల కలిగే డీహైడ్రేషన్ కూడా ఒక కారణం కావచ్చు. ఉదయాన్నే లేవగానే టీకి బదులుగా ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని తాగడం అత్యంత ఉత్తమమైన అలవాటు. నీరు తాగడం వల్ల శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లిపోతాయి మరియు జీర్ణవ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఒకవేళ మీరు టీ తాగాలనుకుంటే, ఏదైనా అల్పాహారం లేదా భోజనం చేసిన తర్వాత తీసుకోవడం సురక్షితం. అప్పుడు ఆహారం కడుపులో ఉండటం వల్ల టీలోని కెఫీన్ నేరుగా కడుపు గోడలపై ప్రభావం చూపదు. చిన్నపాటి మార్పులే పెద్ద ఆరోగ్య ఫలితాలను ఇస్తాయి. టీలో అల్లం లేదా యాలకులు వంటి సహజ పదార్థాలు చేర్చుకోవడం మంచిదే అయినప్పటికీ, అది పరగడుపున తాగకపోవడమే శ్రేయస్కరం. ఉదయాన్నే నీటితో పాటు కొన్ని నానబెట్టిన బాదం పప్పులు లేదా వాల్‌నట్స్ తీసుకోవడం వల్ల మీ శరీరానికి తగిన పోషణ లభిస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మీ ఉదయపు అలవాట్లను ఒక్కసారి పునరాలోచించుకోండి.

# దానిమ్మ తొక్కలను చెత్తలో పడేస్తున్నారా?



ఆయుర్వేదం ప్రకారం ప్రకృతిలో దొరికే ప్రతి వస్తువు ఒక ఔషధమే. ఈ క్రమంలో దానిమ్మ పండును పోషకాల గని అని పిలుస్తాం. కానీ పండు కంటే దాని తొక్కలోనే ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు, మినరల్స్ ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. సాధారణంగా మనం దానిమ్మ పండును తిని, దాని తొక్కలను వేస్ట్ అని భావించి చెత్తబుట్టలో పారేస్తుంటాం. కానీ ఆయుర్వేదం, ఆధునిక పోషకాహార నిపుణుల ప్రకారం.. పండు కంటే దానిమ్మ తొక్కలోనే అత్యధిక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఇందులో ఉండే ఫినోలిక్ ఆమ్లం, ఫ్లేవనాయిడ్లు, టానిన్లు, యాంటీఆక్సిడెంట్లు మన శరీరానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. మెరిసే చర్మం కోసం సహజమైన ఫేస్ ప్యాక్: ముఖంపై మొటిమలు, నల్లటి మచ్చలు లేదా గుల్లలతో బాధపడేవారికి దానిమ్మ తొక్క ఒక వరప్రసాదం. ఎండిన దానిమ్మ తొక్కల పొడిని కొద్దిగా గులాబీ నీటితో కలిపి పేస్ట్‌లా చేయండి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు ముఖానికి రాసుకుంటే, చర్మంపై ఉండే బ్యాక్టీరియా నశించి, చర్మం కాంతివంతంగా మారుతుంది. ఇది రసాయనాలు లేని సహజమైన సౌందర్య సాధనం. కడుపు సమస్యలకు చెక్: వేసవి కాలంలో వేధించే విరేచనాలు లేదా రక్తవిరేచనాల వంటి సమస్యలకు దానిమ్మ తొక్క పొడి అద్భుతంగా పనిచేస్తుంది. గ్లాసు మజ్జిగలో దానిమ్మ తొక్కల పొడిని, కొద్దిగా వేయించిన జీలకర్ర పొడిని కలిపి తాగాలి. ఇది కడుపులోని హానికరమైన బ్యాక్టీరియాను చంపి, పేగుల వాపును తగ్గిస్తుంది. జీర్ణక్రియను సమతుల్యం చేయడంలో ఇది కీలకంగా మారుతుంది. జుట్టు రాలడం - చుండ్రుకు పరిష్కారం: దానిమ్మ తొక్కలు జుట్టు కుదుళ్లను బలపరుస్తాయి. వీటిని జుట్టుకు పట్టించడం వల్ల జుట్టు రాలడం తగ్గడమే కాకుండా చుండ్రు సమస్య నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి. మొలల సమస్యకు ఆయుర్వేద విరుగుడు: మలబద్ధకం, మొలల సమస్యతో బాధపడేవారు ఆయుర్వేద నిపుణుల సలహా మేరకు దానిమ్మ పొడిని మజ్జిగతో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరిచి, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది.

# బిజినెస్

## ఫోన్‌లో నంబర్ సేవ్ చేయకుండానే వాట్సాప్‌లో మెసేజ్ పంపవచ్చు.. ఎట్లనో తెలుసా..!




మెసేజింగ్ సోషల్ మీడియా యాప్ వాట్సాప్ గురించి తెలియని వాళ్లు చాలా తక్కువ. స్మార్ట్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరు వాట్సాప్‌ను వినియోగిస్తారు. ఈ యాప్‌లో ఫోటోలు, వీడియోలతోపాటు కాల్స్ చేసుకొనే వెసులుబాటు కూడా ఉంటుంది. అందుకే ఎక్కువగా వాట్సాప్‌ను ఉపయోగిస్తారు. ఈ వాట్సాప్ ఎప్పటికప్పుడు వినూత్న అప్‌డేట్స్‌తో ముందుకు వస్తుంది. సాధారణంగా అయితే మన కాంటాక్ట్స్ లిస్టులో లేని వ్యక్తికి వాట్సప్‌లో ఏదైనా పంపాలంటే ముందుగా అతని నెంబర్ సేవ్ చేసుకోవాలి. కానీ ఇప్పుడు ఆ అవసరం లేదు. నంబర్ సేవ్ చెయ్యకుండానే కొత్త వాళ్లకు మెసేజ్ పంపవచ్చు. వాట్సప్ సర్చ్ బార్ ఫీచర్ (ఝ్ఞూరాజూజా ంఝుతీఎష్ట్ర ఝతీ టమ్ఞ్‌బతీవ) అందుబాటులోకి రావడంతో నంబర్ సేవ్ చేయాల్సిన అవసరం తప్పింది. ఆ ఫీచర్‌ను యాక్టివేట్ చేసుకుంటే నంబర్ సేవ్ చేయకుండానే మెసేజ్ పంపవచ్చు. అదెట్లనో ఇప్పుడు తెలుసుకుందాం..

సేవ్ చేయని నెంబర్‌కు మెసేజ్ పంపడం ఇలా..

ముందుగా మన మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్ యాప్‌ను ఓపెన్ చేయాలి.

ఐఫోన్ యూజర్లైతే వాట్సాప్ యాప్ పైభాగంలో ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆండ్రాయిడ్ యూజర్లైతే కింద ప్లస్ ఐకాన్ ఉంటుంది. ఆ ఐకాన్‌పై క్లిక్ చేయాలి.

ఆ తర్వాత సెర్చ్ కాంటాక్ట్‌పై క్లిక్ చేసి మెసేజ్ పంపదల్చుకున్న నంబర్‌ను కాపీ చేసి అక్కడ పేస్ట్ చేయాలి.

ఆ నెంబర్‌కు వాట్సాప్ అకౌంట్ ఉంటే చాట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇక ఆ నంబర్‌తో వాట్సాప్ మెసేజ్ చెయ్యవచ్చు.

ఇవేగాక వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్‌తో కస్టమర్లను ఆకట్టుకుంటుంది.

## స్టాక్ మార్కెట్లు భారీ పతనం.. సెన్సెక్స్ 893 పాయింట్లు లాస్



భారతీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 893 పాయింట్లు, నిఫ్టీ 278 పాయింట్లు నష్టపోయాయి. ఉదయం ట్రేడింగ్ 57 పాయింట్ల నష్టంతో 77,061 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ కూడా 31 పాయింట్ల నష్టంతోనే ప్రారంభమైంది. ఉదయం నుంచి కొనసాగిన లాస్ ట్రెండ్ ట్రేడింగ్ ముగిసే వరకు కొనసాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 893.39 పాయింట్లు (1.16 శాతం) నష్టపోయి 76,200.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు (1.16%) కోల్పోయి 23,824.10 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.74 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 77.49 డాలర్ల వద్ద కొనసాగింది. ఔన్స్ బంగారం ధర 4130 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్, మారుతీ సుజుకి షేర్లు లాభాలు పొందగా, ఐటీ స్టాక్స్ తీవ్రంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్ షేర్లు 3.36 శాతం, టీసీఎస్ 3.16 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.79 శాతం, టెక్ మహీంద్రా 1.31 శాతం నష్టపోయాయి. అలాగే, బీఈఎల్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ కూడా భారీగా నష్టపోయాయి. మెటల్ స్టాక్స్ కూడా నష్టాల్లోనే కొనసాగాయి. ఫార్మా షేర్లు మాత్రం స్వల్పంగా లాభాలు పొందాయి. ఇండియాతోపాటు జపాన్, ఇతర ఆసియా మార్కెట్లు, అంతర్జాతీయా మార్కెట్లు కూడా మంగళవారం నష్టాల్లోనే ముగిశాయి.

# దేశంలో 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ యూజర్స్

## ట్రాయ్ తాజా నివేదికలో వెల్లడి



భారత టెలికామ్ రంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది. ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా.. న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తోపాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దాంతో దేశవ్యాప్తంగా టెలి-డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం కూడా టెలికామ్ సంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా వినియోగ సమయం కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది. టెలికామ్ రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికామ్ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని కూడా ట్రాయ్ తన నివేదికలో పేర్కొన్నది.

## బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.41 లక్షల కోట్ల నగదు విడుదల చేసిన ఆర్బీఐ




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇవాళ బ్యాంకింగ్ వ్యవస్థ లోకి భారీగా నగదును విడుదల చేసింది. ఏడు రోజుల వీఆర్‌ఆర్ వేలం ద్వారా రూ.1.41 లక్షల కోట్ల తాత్కాలిక నిధులను విడుదల చేసింది. జీఎస్టీ చెల్లింపుల కారణంగా వ్యవస్థలో ఏర్పడిన నగదు కొరతను అధిగమించేందుకు ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. ఇటీవలి జీఎస్టీ చెల్లింపుల వలన బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు బయటకు వెళ్లింది. దాంతో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత ఒక్కసారిగా పడిపోయింది. జూన్ 21న రూ.30,685 కోట్ల మిగులుతో ఉన్న వ్యవస్థ జూన్ 22 నాటికి రూ.19,971 కోట్ల లోటుకు చేరుకుంది. ఈ పరిణామంతో స్వల్పకాలిక మనీ మార్కెట్ వడ్డీ రేట్లపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. సగటు కాల్ మనీ రేటు 5.43 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ రెపో రేటు కన్నా 0.18 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఆర్‌బీఐ, వ్యవస్థలో తగినంత నగదు ఉండేలా చర్యలు తీసుకుంది. 5.26 శాతం కటాఫ్ రేటుతో బ్యాంకులకు నిధులను అందించింది. ఇలాంటి సమయాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకోకపోతే నిధుల సమీకరణ వ్యయం పెరిగి, ఆర్థిక వ్యవస్థలో రుణ ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఇది ఆర్థిక మందగమనానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ సాధారణంగా పన్ను చెల్లింపులు, ముందస్తు పన్ను చెల్లింపులు లేదా ఇతర కాలానుగుణ రుణ డిమాండ్ వంటి కారణాలవల్ల ఏర్పడే స్వల్పకాలిక నగదు లోటును సరిచేయడానికి వివిధ ద్రవ్య విధాన సాధనాలను ఉపయోగిస్తుంది. తాత్కాలిక నగదు అవసరాల కోసం వీఆర్‌ఆర్ వేలాలను నిర్వహిస్తుంది. దీనికింద బ్యాంకులు తమవద్ద ఉన్న ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ వద్ద తాకట్టు పెట్టి నిధులు పొందుతాయి. ఇక దీర్ఘకాలిక ద్రవ్య లభ్యత కోసం ఆర్‌బీఐ సెకండరీ మార్కెట్ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయడం లేదా డాలర్-రూపాయి స్వాప్ వేలాలను నిర్వహించడం వంటి చర్యలు చేపడుతుంది. తాజా చర్యతో బ్యాంకింగ్ వ్యవస్థలో స్వల్పకాలిక నిధుల ఒత్తిడి తగ్గి, ఆర్థిక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.

# మరో టీ20 లీగ్ సంబరం.. టీమిండియా స్టార్లు రెడీ!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రవేశపెట్టిన తర్వాత భారత్‌లో టీ20 ఫార్మాట్‌కు ఆదరణ మరింతగా పెరిగింది. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాలు స్థానికంగా టీ20 లీగ్‌లు నిర్వహిస్తూ దేశీ ఆటగాళ్లకు చక్కటి వేదిక కల్పిస్తున్నాయి. ఇప్పటికే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, బెంగాల్ టీ20 లీగ్‌లు నిర్వహిస్తుండగా.. ఇటీవలే తెలంగాణ కూడా ఈ జాబితాలోకి చేరింది.

**మరో టీ20 లీగ్ సంబరం**

టీజీ20 పేరిట హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహిస్తోంది. జూన్ 21న మొదలైన ఈ లీగ్ జూలై 12న ఫైనల్‌తో ముగియనుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (ఞూూ) షెడ్యూల్ విడుదలైంది. డీపీఎల్ మూడో ఎడిషన్‌ను జూలై 31 నుంచి ఆగస్టు 30 మధ్య నిర్వహించనున్నట్లు ఢిల్లీ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. ఈసారి కూడా టీమిండియా స్టార్లు ఈ లీగ్‌లో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు.

**టీమిండియా స్టార్లు సిద్ధం**

భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్‌తో పాటు.. హర్షిత్ రాణా డీపీఎల్‌లో భాగం కానున్నాడు. వీరితో పాటు టీమిండియా వెటరన్ పేసర్లు ఇషాంత్ శర్మ, నవదీప్ సైనీ కూడా లీగ్ ఆడనున్నారు. ఇక ఐపీఎల్ స్టార్లు నితీశ్ రాణా, ఆయుశ్ బదోని, ప్రియాన్ష్ ఆర్య, సూయశ్ శర్మ, దిగ్వేశ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, యశ్ ధుల్, అనూజ్ రావత్, సిమర్జీత్ సింగ్, హిమ్మత్ సింగ్, హృతిక్ షోకీన్, సార్థక్ రంజన్ తదితరులు డీపీఎల్ బరిలో దిగనున్నారు. అనుభవజ్ఞులైన, యువ ప్లేయర్లతో సమతూకం చేసుకుంటూ ఫ్రాంచైజీలు తమ జట్లను తయారుచేసుకున్నాయి.

**మహిళల లీగ్ కూడా..**

ఇక మహిళల డీపీఎల్‌ను ఈసారీ ఆటంకాలు లేకుండా కొనసాగించనున్నారు. శ్వేతా సెహ్రావత్, ప్రియా పునియా, సోని యాదవ్, ఆయుశి సోని తదితరులు ఇందులో భాగం కానున్నారు. వీరితో పాటు రైజింగ్ స్టార్లు తనీషా సింగ్, నజ్మా, మోనికా, పూర్వా సివాచ్ కూడా లీగ్లో ఆడనున్నారు.

కాగా పురుషుల డీపీఎల్‌లో గతేడాది.. నితీశ్ రాణా సారథ్యంలో వెస్ట్ ఢిల్లీ లయన్స్ విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో శ్వేతా సెహ్రావత్ కెప్టెన్సీలో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ చాంపియన్‌గా అవతరించింది.

**డీపీఎల్-2026లో పాల్గొనే పురుష జట్లు**

సెంట్రల్ ఢిల్లీ కింగ్స్, ఈస్ట్ ఢిల్లీ రైడర్స్, న్యూ ఢిల్లీ టైగర్స్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్, ఔటర్ ఢిల్లీ వారియర్స్, పురానీ ఢిల్లీ 6, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్.

**మహిళల జట్లు**

సెంట్రల్ కింగ్స్ వుమెన్, ఈస్ట్ ఢిల్లీ రైడర్స్ వుమెన్, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ వుమెన్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్ వుమెన్.

## పదిహేనేళ్లు మాతోనే ఉంటాడు!.. రెండేళ్లకే వదిలేశారుగా



ఊహాగానాలే నిజమయ్యాయి. లక్నో సూపర్ జెయింట్స్ తమ కెప్టెన్ రిషభ్ పంత్‌ను వదులుకుంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్‌కి ట్రేడ్ చేసి బదులుగా.. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకుంది. కాగా ఐపీఎల్-2025 మెగా వేలంలో భాగంగా లక్నో పంత్ కోసం ఇతర ఫ్రాంచైజీలతో పోటీపడ్డ సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎక్కడా తగ్గకుండా ధరను పెంచుకుంటూ పోయిన లక్నో.. ఏకంగా రూ. 27 కోట్లకు పంత్‌ను సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా అతడు నిలిచాడు. ఇక పంత్‌ను తమ జట్టు కెప్టెన్‌గా నియమించిన లక్నోకు రెండు సీజన్లలో తీవ్రమైన నిరాశే మిగిలింది. గతేడాది పంత్ కెప్టెన్సీలో పద్నాలుగు ఆరు మ్యాచ్‌లే గెలిచిన లక్నో.. ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. వ్యక్తిగతంగా పంత్ 14 మ్యాచ్‌లలో కలిపి కేవలం 269 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇక ఈ ఏడాది 13 ఇన్నింగ్స్‌లో కలిపి కేవలం 312 పరుగులు చేసిన పంత్... జట్టును అట్టడుగున పదో స్థానంలో నిలిపాడు. అతడి సారథ్యంలో లక్నో పద్నాలుగింట కేవలం నాలుగు మ్యాచ్‌లే గెలిచి చెత్త ప్రదర్శన నమోదు చేశాడు. ఈ నేపథ్యంలో పంత్‌ను రూ. 15 కోట్లకు లక్నో ట్రేడ్ చేసింది. ఈ నేపథ్యంలో లక్నో జట్టు యజమాని సంజీవ్ గోయెంకా గతంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. "పంత్ లక్నోకు దాదాపు పదిహేనేళ్ల పాటు ఆడతాడు. ఈ ప్రయాణంలో కనీసం నాలుగు నుంచి ఆరు ఐపీఎల్ టైటిళ్లు సాధిస్తాడు. ముంబై, చెన్నై జట్లను విజయవంతమైన జట్లుగా ప్రజలు చూస్తారు. మహీ (ధోని), రోహిత్ శర్మ ఈ రెండు జట్లను ఉన్నత శిఖరాలకు చేర్చారు. పదేళ్ల తర్వాత మహీ, రోహిత్ తర్వాత రిషభ్ పేరునే అందరూ చెప్తారు. నా మాటలు రాసిపెట్టుకోండి" అంటూ సంజీవ్ గోయెంకా పంత్‌ను ఆకాశానికెత్తాడు.

# స్పోర్ట్స్

## టెస్టు కెప్టెన్సీకి టైమొచ్చింది.. స్వదేశంలో ఎంగరవాకు తొలి పరీక్ష..!



జింబాబ్వేకు వన్డేల్లో సారథ్యం వహిస్తున్న రిచర్డ్ ఎంగరవా టెస్టుల్లోనూ జట్టును నడిపించనున్నాడు. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో ఏకైక టెస్టుకోసం స్క్వాడ్‌ను ప్రకటించిన సెలెక్టర్లు ఎంగరవాను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిదే తొలి పరీక్ష. స్వదేశంలో జూన్ 28న మొదలయ్యే ఈ మ్యాచ్‌తో జట్టును గెలుపు దిశగా నడిపించేందుకు సిద్ధమవుతున్నాడీ పొడగరి పేసర్. ఏకైక టెస్టుకోసం ఎంపిక చేసిన 15మంది బృందంలో స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజాకు చోటు దక్కలేదు. ఇంగ్లండ్ వేదికగా జరిగే కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు రజా కట్టుబడి ఉండడంతో అతడిని పక్కన పెట్టేశారు. నిరుడు ఏప్రిల్ -- మే నెలలో జింబాబ్వే, బంగ్లాదేశ్ రెండు టెస్ట్‌ల్లో తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో జింబాబ్వే మూడు వికెట్ల విజయం సాధించింది. కానీ, రెండో మ్యాచ్‌లో గెలుపొందిన బంగ్లా సిరీస్‌ను సమం చేసి పరువు కాపాడుకుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఇరుజట్లు ఏకైక టెస్టులో విజయంపై కన్నేశాయి. జూన్ 28న హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ జరుగనుంది. జింబాబ్వే స్క్వాడ్ : రిచర్డ్ ఎంగరవా(కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, తనకా చివంగా, గ్రేమీ క్రెమర్, క్రేగ్ ఎర్విన్, బ్రాడ్ ఎవాన్స్, ఇన్నోసెంట్ కైయా, రాయ్ కైయా, వెస్లీ మధెవెరె, తడివనషె మరుమని, బ్లెస్సింగ్ ముజరబని, న్యూమాన్ న్యామ్‌హురి, బ్రెండన్ టేలర్, తఫడ్జ్వ త్సిగా.




# ‘స్టూడెంట్’గా మేఘాంశ్ శ్రీహరి.. ఫస్ట్ లుక్ వైరల్

రాజ్‌దూత్, కోతి కొమ్మచ్చి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు దివంగత నటుడు, రియల్ స్టార్ శ్రీహరి కుమారుడు మేఘాంశ్ శ్రీహరి. లాంగ్ గ్యాప్ తర్వాత కొత్త సినిమాతో అప్‌డేట్‌తో హాయ్ చెప్పాడు. మేఘాంశ్ శ్రీహరి హీరోగా నటిస్తోన్న చిత్రం స్టూడెంట్ బాలు తత్వమసి డైరెక్ట్ చేస్తున్నఈ మూవీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో మేఘాంశ్ శ్రీహరి డ్రాయింగ్ లుక్ కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో పేపర్‌పై కొన్ని కొటేషన్లను గమనించవచ్చు. ధైర్యం కలిగిన ఒక్క వ్యక్తి మెజారిటీ అవుతాడు.. మెంటల్ మాస్ తుఫాన్ రాబోతుందంటూ రిలీజ్ చేసిన లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# రూ. 50 కోట్ల క్లబ్బులోకి ‘మా ఇంటి బంగారం’




బాక్సాఫీస్ వద్ద ‘మా ఇంటి బంగారం’ రికార్డులు సృష్టిస్తోంది. దాదాపు మూడేళ్ల గ్యాప్ తర్వాత సమంత నటించిన చిత్రమిది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సమంత భర్త రాజ్ నిడిమోరు కథ, కథనం అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించాడు. భారీ అంచనాలతో ఈ నెల 19న విడుదలైన ఈ మూవీ తొలి రోజు మిక్స్‌డ్ టాక్ సంపాదించుకుంది. రెండో రోజు నుంచి నెమ్మదిగా పుంజుకొని వీకెండ్‌లో భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఫ్యామిలీ ఆడియన్స్, ముఖ్యంగా మహిళలు ఈ చిత్రంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. తొలి రోజు ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇక కేవలం నాలుగు రోజుల్లోనే హాఫ్ సెంచరీ(రూ.50 కోట్లు) కొట్టి రికార్డు క్రియేట్ చేసింది. నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ. 50 కోట్ల వసూలు వచ్చినట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ చిత్రానికి రూ. 30 కోట్ల బడ్జెట్ అయినట్లు సమాచారం. ఇప్పటికే ఓటీటీ, శాటిలైట్స్, ఆడియో రైట్స్ రూపంలో రూ. 35 కోట్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక థియేటర్స్‌లోనూ భారీ కలెక్షన్స్ రాబడుతోంది. మొత్తంగా గ్యాప్ తీసుకొని వచ్చిన సమంతకు ‘మా ఇంటి బంగారం’తో భారీ బ్లాక్ బస్టర్ దక్కింది.

# ‘పెద్ది’ తర్వాత మారిన బుచ్చిబాబు ప్లాన్ .. ఇక లాంగ్ గ్యాప్‌లకు గుడ్‌బై



టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. ‘ఉప్పెన’ సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు.వీశీజఱవం దీంతో ‘ఉప్పెన’ తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన ‘పెద్ది’ ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ‘పెద్ది’ విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. అయితే ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ‘పెద్ది’ తర్వాత బుచ్చిబాబు గతంలా సంవత్సరాల తరబడి విరామం తీసుకోవాలని భావించడం లేదట. కొంతకాలం విశ్రాంతి తీసుకున్న తర్వాత వెంటనే కొత్త కథలపై దృష్టి పెట్టాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టోరీ డెవలప్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేసి, గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా పలువురు స్టార్ హీరోలతో ఆయన కాంబినేషన్‌లపై సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం ఆయన పూర్తిగా కొత్త కథ అభివృద్ధిపైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.



# 2027 ప్రభాస్ నామ సంవత్సరం.. ఒకటి కాదు మూడు భారీ ట్రీట్స్ ప్లాన్ చేస్తున్న రెబల్ స్టార్

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. ‘బాహుబలి’ తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన ‘రాజా సాబ్’ సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘ఫౌజీ’పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం ‘ఫౌజీ’ 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న ‘స్పిరిట్’ ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు ‘బాహుబలి’ ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ‘బాహుబలి’ ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో ‘ఫౌజీ’ కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు ‘ప్రభాస్ నామ సంవత్సరం’గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ‘స్పిరిట్’, ‘ఫౌజీ’, ‘బాహుబలి: ది ఎటర్నల్ వార్’ చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.



# ‘ది పారడైజ్’ రిలీజ్‌పై క్లారిటీ వచ్చినట్టేనా..

## నాని పాన్ ఇండియా మూవీకి కొత్త రిలీజ్ డేట్ టాక్!

న్యాచురల్ స్టార్ నాని హీరోగా, యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘ది పారడైజ్’పై ప్రేక్షకుల్లో రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ‘దసరా’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ఈ కాంబినేషన్ మరోసారి కలిసి పని చేస్తుండటంతో సినిమా ప్రకటించినప్పటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఈ చిత్రం విడుదల తేదీ విషయంలో గత కొంతకాలంగా అనేక వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 మార్చిలో విడుదల చేయాలని మేకర్స్ భావించినట్లు ప్రచారం జరిగింది. అనంతరం సినిమా షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆగస్టు విడుదలకు సంబంధించి కూడా అధికారిక ప్రకటన రాకపోవడంతో సినిమా డిసెంబర్‌కు వెళ్లే అవకాశముందని సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పుడు తాజా సమాచారం ప్రకారం ‘ది పారడైజ్’ను సెప్టెంబర్ 25, 2026న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం ‘ది పారడైజ్’ షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమాను అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా డిజైన్ చేస్తూ, పాన్ ఇండియా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మేకింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్ కూడా అంచనాలను దాటి భారీ స్థాయికి చేరినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అయినప్పటికీ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారట. కంటెంట్, మేకింగ్ స్కేల్ విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. మరోవైపు కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక ప్రతినాయక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్ కూడా ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు.అలాగే బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ తారాగణం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రానికి స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘దసరా’ తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో సంగీతం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని అభిమానులు భావిస్తున్నారు. ‘ది పారడైజ్’ను కేవలం తెలుగు సినిమా కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967